జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 01 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 147 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## వైద్యుడు నోరి దత్తాత్రేయుడుకి పద్మభూషణ్

**దేశానికే గర్వకారణం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు (వైద్యం), ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. దత్తాత్రేయుడు నోరికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల

మిగతా 2లో..

## అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

**450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ**

న్యూయార్క్,జులై31(ప్రజాజ్యోతి): అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది.వాల్ స్ట్రీట్

మిగతా 2లో..

# 'సర్'.. దుమారం!

# లక్షల్లో ఓట్లు గల్లంతేనా!!

- 'అన్‌కలెక్టబుల్' పేరుతో తొలగింపు!!
- సేకరించడానికి వీలు లేనివిగా గుర్తింపు
- భారీ సంఖ్యలో ఓట్లను ఈసీ తొలగింపు
- 40 లక్షలకు పైగా ఆ జాబితాలో చేర్పు!
- హైదరాబాద్‌లో భారీగా ఓట్ల రద్దు!
- క్యూర్‌లోనూ పలుచోట్ల అదే పరిస్థితి
- రెండురోజుల్లో ముగియనున్న గడువు
- రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరం
- తీవ్ర వివాదాస్పదంగా మారిన ప్రక్రియ
- ఆందోళన చెందుతున్న ప్రజలు




**ప్రజాజ్యోతి ప్రత్యేకం**

రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కీలక సమాచారం వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల ఓట్లను మళ్లీ తిరిగి వెనక్కి తీసుకునేందుకు వీలు లేని (అన్‌కలెక్టబుల్) వాటిగా పరిగణిస్తూ వాటిని తొలగించడానికి ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సర్వే పూర్తి చేసిన ప్రాంతాల్లో ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందించామని, వాటిలో కొన్ని పత్రాలు సేకరించడానికి వీలు లేకుండా ఉండటంతో వాటిని అన్‌కలెక్టబుల్‌గా నిర్ధారిస్తున్నట్లు అధికారులు గణాంకాలతో చూపిస్తున్నట్లు తెలిసింది.

ఇలా ఓట్ల తొలగింపు విషయమై ఎన్నికల సంఘం కార్యాలయం దగ్గర గురువారం ఓ ప్రధాన రాజకీయ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్యూమరేషన్ పత్రాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియకు ఆగస్టు 3 వరకు గడువు ఉన్నప్పటికీ ఇలా ముందుగానే అన్‌కలెక్టబుల్ పేరుతో ఓట్లను ఎలా తొలగిస్తున్నారని ఎన్నికల అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,38,26,448గా తేలిందని, వీటిలో గురువారం సాయంత్రం 6 గంటల వరకు 2,59,50,506 అంటే 76.72 శాతం మంది ఓటర్ల పత్రాలు డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్' ప్రక్రియ రాను రాను వివాదాస్పదంగా మారు తోంది. లక్షల్లో ఓట్లు 'అన్‌కలెక్టబుల్' పేరిట తొలగిస్తూ పక్కకు పెట్టె ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్ల నమోదు సవరణ ప్రక్రియలో భాగంగా స్థానికంగా అందుబాటులో లేనివారు , ఇతర ప్రాంతాలకు మారినవారు , మరణించినవారి ఓట్లను తొలగించేందుకు ఎన్నికల అధికారులు కేటగిరీని నిబంధనల ప్రకారం ఉపయోగిస్తారు. అయితే, ఈసారి 'అన్‌కలెక్టబుల్' పేరుతో ఊహించని రీతిలో లక్షలాది ఓట్లను ఇందులో చేర్చడం గమనార్హం. రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గబోతోందంటే మీరు నమ్ముతారా? కానీ ఇప్పుడు జరిగే వాస్తవం మాత్రం ఇదే. హైదరాబాద్‌లో నకిలీ ఓట్లు భారీగా ఉన్నాయి. అదే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా గతంలో ఇక్కడ ఓటు

మిగతా 2 లో..

### మరోమారు సర్ గడువు పొడిగింపు

ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి

మిగతా 2 లో..

# పీఎం కిసాన్ మరో ఐదేళ్లు

**రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు**

**ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు**

**పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు**

**కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్**



న్యూఢిల్లీ,జూలై31(ప్రజాజ్యోతి): కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు,

మిగతా 2 లో..

### రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగింపు

**ఆగస్టు 31 వరకు పొడిగించిన ప్రభుత్వం**

**నేటినుండి నుంచి 3 నెలల రేషన్ పంపిణీ**

న్యూఢిల్లీ,జూలై31(ప్రజాజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టం కింది రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. రాష్ట్రంలో రేషన్ కార్డుల ఈ-కేవైసీ గడువు నేటితో ముగియనుండగా, దాన్ని ఆగస్టు 31 వరకు

మిగతా 2 లో..

# కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారు

**రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయండి**

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర హైకోర్టు**



హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): హైడ్రా ,శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని

మిగతా 12 లో..

### నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్

**ఫార్ములా ఈ రేస్ కేసు విచారణ**

**తదుపరి విచారణ 25కు వాయిదా**

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): ఫార్ములా-ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్

మిగతా 2 లో..

### తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్

**జారీని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ పక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల

మిగతా 2 లో..

**ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా**

# హైదరాబాద్

**దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను పదిశాతం పెంచుతాం**

**పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశం**

**సీఐఐ ప్రతినిధుల భేటీలో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడే తెలంగాణ తమ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. పెట్టుబడులకు అత్యంత సురక్షిత రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. రండి...

మిగతా 12 లో..

### ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి

**అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు

మిగతా 12 లో..



'పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు' అనే వార్త బీఆర్ఎస్ శ్రేణుల గుండె బరువెక్కిస్తుంది. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానికంగా రోహిణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. కాగా తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామం నల్లబెల్లిలో అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 'పెద్ది'ని కడసారి చూసేందుకు అభిమానులు, స్థానికులు భారీగా తరలివచ్చారు. దీంతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. బాధాతప్త హృదయాలతో ఆయనకు వీడ్కోలు పలికారు.

## బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే

# పెద్ది కన్నుమూత

- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- అభిమాన నాయకుడు మరణంతో విషాదం
- నర్సంపేటలో భారీగా తరలివచ్చిన జనం
- రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- అంతిమయాత్రకు భారీగా జనం రాక
- కన్నీరు పెట్టుకున్న మాజీ మంత్రి హరీష్



వరంగల్,జూలై31(ప్రజాజ్యోతి): తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.

మిగతా 12 లో..

### ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం
- పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత
- ఉద్యమ సహచరుడిని కోల్పోయా: హరీష్ సంతాపం
- నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది: కేటీఆర్
- పెద్దిరెడ్డి మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ

మిగతా 12 లో..

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను సాగనివ్వని.. లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్!

పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. కేవలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్÷–పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడుకుంటూ, పై అధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్రయోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థాయిలో పోలీసులు పూర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన పక్రియలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని కేవలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయవాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘటనల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫల మవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వా మ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండకూడదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడకూడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉపయోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడింట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్రణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతాయని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతున్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో కేవలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

## రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి..**

పొడిగించింది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ, రేపటి నుంచి ఆగస్టుతో పాటు సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన ప్రజా పంపిణీకి రంగం సిద్ధమైన దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని జిల్లాల పౌర సరఫరాల శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజా నిర్ణయం రీత్యా అర్హులైన ప్రతి ఆహార భద్రత కార్డుదారులు రేపటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రేషన్ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడంతో పాటు మూడు నెలల రేషన్ సరకులు పొందవచ్చు.గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు పోర్టబిలిటీ సౌకర్యం ఉ పయోగించుకోవడం ద్వారా తమకు అనుకూలమైన చౌక ధరల దుకాణం నుంచి రేషన్ పొందవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య ఒక కోటి 6 వేలు ఉండగా లబ్ధిదారుల సంఖ్య 3,42,50,110 వరకు ఉన్నారు. ఇది దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సజావుగా పంపిణీ చేసేందుకు జిల్లాల అధికారయంత్రాంగం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకించి ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 15,97,303 రేషన్ కార్డులు ఉండగా 58,57,058 మంది లబ్ధిదారులు నమోదై ఉన్నారు.జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇంకా 20 శాతం కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోలేదు. రంగారెడ్డి జిల్లాలో 6,75,864 లబ్ధిదారులకుగాను 23,04,980 మంది సభ్యులు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకూ రంగారెడ్డి జిల్లాల్లో కూడా 35 శాతం ఈ-కేవీసీ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో రేపటి నుంచి పంపిణీ చేసేందుకు హైదరాబాద్ జిల్లాలో 8,43,607 ఆహార భద్రత కార్డుదారులకు ప్రభుత్వం 59,602,822 మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు 7,279,513 మెట్రిక్ టన్నుల గోధుమలు కేటాయించింది.రేషన్ ద్వారా లబ్ధిదారులకు బియ్యం ఉచితంగా గోధుమలు కిలోకు రూ.7 చొప్పున అందిస్తున్నారు. 653 ఛౌక ధరల దుకాణాల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయనున్నట్లు హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ వెల్లడించారు. తెలంగాణలో అన్ని జిల్లాల్లో అర్హులైన ఆహార భద్రత కార్డుదారులు ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు తమ మూడు నెలల రేషన్ పొందవచ్చు. నెల మొత్తం సాగనున్నందున ఇక చివరి రోజుల్లో కార్డుదారుల రద్దీ నివారించేందుకు వీలైనంత వరకు త్వరగా రేషన్ సరకులు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ లబ్ధిదారులకు సూచించింది.

# ‘సర్’.. దుమారం!

**మొదటిపేజీ తరువాయి..**

నమోదు చేసుకున్నారు. దీంతో వారికి సొంత రాష్ట్రంలో సైతం ఓటు ఉంది. ఇలాంటి సమస్యలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చెక్ పెట్టేస్తుంది. రెండు రాష్ట్రాల్లో ఓటు ఉంటే 2 ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. కానీ ఓటర్లు తమకు నచ్చిన ఏదైనా ఒక దానిని మాత్రమే ఎంచుకోవాలి. లేదంటే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని ఎన్నికల అధికారులు ముందు నుంచీ చెబుతూనే ఉన్నారు. అవసరమైతే రెండు చోట్ల ఓటు రద్దు కూడా



అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ లెక్కన అప్రమత్తమైన ఓటర్లు తమ సొంత రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని ప్రకారం హైదరాబాద్‌లో మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని వెనక్కి ఇవ్వడం లేదు. ఈ కారణంతో గరిష్ఠంగా హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు రద్దు కేటగిరీలో చేరనున్నాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉ ంది. ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్న వారు చాలా మంది వాటిని తిరిగి బీఎల్వోలకు ఇవ్వట్లేదు. ఆగస్టు 3 వరకు గడువుందని చాలా మంది ఇంకా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అయితే చివరి తేదీన సర్వర్ సమస్యలు తలెత్తుతాయనే ఉ ద్దేశంతో ఉద్యోగులు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో వేగం పెంచారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వని వారి ఓట్లు కూడా ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్తున్నాయనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది.హైదరాబాద్ జిల్లా పరిధిలోని అంబర్‌పేటలో ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలీకరణ ఇప్పటికే 50 శాతం పూర్తి అయింది. అయితే రద్దు కేటగిరీ ఓట్లు అంబర్‌పేటలో 3 శాతం, కంటోన్మెంట్‌లో 20 శాతంగా ఉండటం గమనార్హం.ఓటరు జాబితా సవరణలో పలు నియోజకవర్గాల్లో అధికారులూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ స్వీకరణ, డిజిటలీకరణలో సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదు. దీంతో ఇప్పటి వరకు క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల్లో 20 శాతం ఓట్లు ఏఎస్‌డీలోకి వెళ్లాయని, మరో వారం రోజుల్లో 40 శాతానికి మించుతుందని స్థానిక యంత్రాంగం అంచనా వేస్తోంది. ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగివ్వని వారితో పాటు ఇల్లు మారిన, మృతి చెందిన (ఏఎస్‌డీ), నియోజకవర్గం మారిన, ఓటర్ల వివరాలను జాబితా నుంచి తీసేస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది.ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు నింపేందుకు ఓటర్లకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలమ్‌లో పేరు, ప్రస్తుత అడ్రస్‌ను రాసి ఇవ్వాలని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) చెబుతున్నారు. తర్వాత నోటీసుకు ఏదైనా అధికారిక ధ్రువీకరణ పత్రం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని అధికారులు పదే పదే గుర్తుచేస్తున్నారు. ఓటరు నమోదు పత్రాలు నింపేందుకు జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంతో పాటు సర్కిల్ ఆఫీసుల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు విస్తృతంగా పని చేస్తున్నాయి. గతంలో సర్వేకు ప్రామాణికమైన ఓటరు జాబితాను అధికారులు గల్లంతు చేశారు. ఈ పరిస్థితి హైదరాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో చోటుచేసుకుంది. న్యూ బోయిన్‌పల్లి, తిరుమలగిరి, ఇతర ప్రాంతాలతో కలిపి నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 2002 నాటి ఓటర్ల వివరాలు మాయమయ్యాయి. ఆ జాబితాలోని 4 వేల మంది ఓటర్ల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులు హైదరాబాద్ నగరమంతటా ఉన్నాయి.ఎన్యూమరేషన్ ఫారంలో మూడు గడులుంటాయి. మొదటి గడిలో 2002లో తనకున్న ఓటు వివరాలు రాయాలి. ఒకవేళ అప్పుడు ఓటరు కాకపోతే రెండో గడిలో తల్లిదండ్రులకు చెందిన నాటి ఓటరు వివరాలు అందులో రాయాలి. అదీ కుదరకపోతే మూడో గడిలో ఓటరు ప్రస్తుత వివరాలను నమోదు చేయాలి. మొదటి, రెండో భాగాల్లో వివరాలను నమోదు చేయడం 70 శాతం మందికి ఇబ్బందిగా ఉంటోంది. దీంతో బీఎల్‌వోలు మూడో భాగంలో మీ పేరు, మీ తల్లిదండ్రుల పేరు, ఇతర వివరాలను నింపాలి. ఆ తర్వాత ఎన్యూమరేషన్ పత్రాన్ని తిరిగివ్వాలని సూచిస్తున్నారు.మూడో గడిని మాత్రమే నింపిన వారు, ఓటరు జాబితా గల్లంతు, పేర్లు సరిపోలకపోవడం వంటి మొదలైన కారణాలున్న వ్యక్తులు, నోటీసులు అందుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు డిజిటైజేషన్ చేస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల్లోని వివరాల్లో 80 శాతం మందికి నోటీసులందే సూచనలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాగా. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్ట్ 3వ తేదీ వరకు పొడిగిస్తూ తాజాగా ఉ త్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయిలో సర్వే నెమ్మదిగా సాగుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే తాజా షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఆగస్ట్ 3వ తేదీ వరకు ఇంటింటి సర్వే, ఓటరు వివరాల సేకరణ, ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను కొనసాగిస్తారు.

ఆ తర్వాత ఆగస్ట్ 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత కొత్తగా ఓటు నమోదు, పేరు సవరణ, మార్పులు, అభ్యంతరాల స్వీకరణకు ఆగస్ట్ 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు గడువు కల్పించారు. ఈ దరఖాస్తులపై విచారణ, నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియను అక్టోబర్ 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక అక్టోబర్ 12వ తేదీన తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

## మరోమారు సర్ గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి..**




ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ÷-లకెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని , అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ గడువు జులై 24 వరకే ఉ ండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ పక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' పక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

# పీఎం కిసాన్ మరో ఐదేళ్లు

**మొదటిపేజీ తరువాయి..**

సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎ÷-లోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది.సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## వైద్యుడు నోరి దత్తాత్రేయుడుకి పద్మభూషణ్

**మొదటిపేజీ తరువాయి..**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను అమిత్ షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్య ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశారు. ౣ÷ళివలం ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే నిజమైన మౌన సాధకులకు, కర్మయోగులకు నేడు ఈ జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రోగుల సంక్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం ఒక వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశ ప్రగతికి దిశానిర్దేశర చేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన శ్రీ అమిత్ షా... డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలం పాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.

## అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

**మొదటిపేజీ తరువాయి..**

ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా' ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉ ంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్‌ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

## తెలంగాణలో ఫ్యామిటీ సర్టిఫికెట్

**మొదటిపేజీ తరువాయి..**

సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.




## నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..**

రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో ఊఓఆంకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డి, ఈఇక్ష కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కేటీఆర్ లక్ష పూచీకత్తు , 2 షూరిటీస్ సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.



**CHANGE OF NAME**

I, **SAWAPURE PRANEETH S/O SAWAPURE VIJAY KUMAR** (Old Name) born on 04-03-1995 at sawapur earlier was holding passport no. **N5994389** DT: 18-12-2015 hereby changing my name and henceforth in future I would be known as SAWAPURE PRANEETH KUMAR S/O SAWAPURE VIJAY KUMAR (New name) HNo. 2-54 SAWAPUR, Dist. Adilabad 504309 Telangana.

**Place: SAWAPURE**
**Date: 16-06-2026**

**DECLARANT.**
**PRANEETH KUMAR**
**S/O SAWAPURE VIJAY KUMAR**

## వర్షపు తీవ్రతకు నేలమట్టమైన నాలుగు ఇండ్లు

### ఇండ్లను పరిశీలించిన సర్పంచ్ రెవెన్యూ అధికారులు



**నేరడిగొండ, జూలై 31 (ప్రజా జ్యోతి) :** మండలంలో గురువారం రోజు కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కుమారి గ్రామ పంచాయతీ పరిధిలో వర్షపు ధాటికి నాలుగు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. ఇళ్లు కూలి పోవడంతో తీవ్రంగా నష్టపో యిన బాధితులు వెంటనే విషయాన్ని గ్రామ సర్పంచ్‌కు తెలియజేశారు. సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న వెంటనే స్పందించి మండల రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు, విలేజ్ ఆఫీసర్, సర్పంచ్ మరియు ప్రజాప్రతినిధులు కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ వర్షాల వల్ల గ్రామానికి చెందిన మారుపాక భూమేష్, బండారి లక్ష్మీబాయి,ఓర్స విలాస్, మరియు మామిడిపల్లి లక్ష్మిలకు చెందిన ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు విలేజ్ ఆఫీసర్ ధ్రువీకరించారు. ఈ సందర్భంగా విలేజ్ ఆఫీసర్ మాట్లాడుతూ... బాధితుల ఇళ్ల వివరాలను, నష్ట తీవ్రతను ఉన్నతాధికారులకు మరియు రెవెన్యూ సిబ్బందికి నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా బాధితులందరికీ త్వరలోనే తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదేపు రవి, వార్డు సభ్యులు టి.లలిత, ఓర్స సాయికిరణ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఉన్నతాధికారుల బదిలీలు

### – ఎనిమిది మంది జనరల్ మేనేజర్లకు కొత్త పోస్టింగులు

**మంచిర్యాల, జూలై 31 (ప్రజా జ్యోతి) :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో ఉన్నతాధికారుల స్థాయిలో కీలక బదిలీలు, పోస్టింగులు చేపట్టారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ ఆర్‌సీ విభాగం శుక్రవారం (జూలై 31) ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఎనిమిది మంది జనరల్ మేనేజర్లు, అదనపు జనరల్ మేనేజర్లకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఉత్తర్వుల ప్రకారం సత్తుపల్లి జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న చింతల శ్రీనివాస్‌ను కార్పొరేట్ కార్యాలయంలో జీఎం (ఆర్ అండ్ డీ)గా నియమించారు. ఆర్‌జీఎం రీజియన్ క్వాలిటీ మేనేజర్‌గా ఉన్న సుజోయ్ మజుందర్ను కేటీజీఎం రీజియన్ క్వాలిటీ మేనేజర్‌గా బదిలీ చేశారు. కేటీజీఎం రీజియన్ క్వాలిటీ మేనేజర్ జె. వెంకటరమణను ఆర్‌జీఎం రీజియన్‌కు మార్చారు. కార్పొరేట్ ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్కు ఆర్జీ–2 జనరల్ మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. కార్పొరేట్ విద్యా విభాగం జనరల్ మేనేజర్ ఎస్. వెంకటాచారిని సత్తుపల్లి జనరల్ మేనేజర్‌గా నియమించారు. కార్పొరేట్ ఆర్ అండ్ డీ విభాగం జనరల్ మేనేజర్ చె. వెంకటరమణను కేటీజీఎం జనరల్ మేనేజర్గా పోస్టింగ్ ఇచ్చారు. అదనపు జనరల్ మేనేజర్ ఎం.వి. నరసింహారావును వీకేఓసీ (కేటీజీఎం) నుంచి కార్పొరేట్ జీఎం (ఐ అండ్ పీఎం) కార్యాలయానికి బదిలీ చేయగా, కార్పొరేట్ పర్చేజ్ విభాగంలో పనిచేస్తున్న జి.ఎస్. గోపాలరాజును కార్పొరేట్ జీఎం (ఎస్టేట్స్) కార్యాలయానికి నియమించారు. సదరు బదిలీలతో సంబంధిత అధికారుల జీతభత్యాలు, పే స్కేలు, గ్రేడ్‌లో ఎలాంటి మార్పులు ఉండవని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ అయి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. ఈ బదిలీ ఉత్తర్వులు సమర్థ అధికారుల ఆమోదంతో జారీ చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ ఆర్‌సీ విభాగం జనరల్ మేనేజర్ (పర్సనల్) ఉత్తర్వులో తెలిపారు.

## 38 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

### – ఎస్టీపీపీలో ఇద్దరు సీనియర్ అధికారులకు సన్మానం



**జైపూర్ జూలై 31 ప్రజా జ్యోతి :** జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో పదవీ విరమణ పొందిన ఇద్దరు సీనియర్ అధికారులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. జనరల్ మేనేజర్ (పీసీఎస్ – ఓఎం)గా 38 ఏళ్లపాటు సేవలందించిన ఎం. మదన్ మోహన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్)గా 37 ఏళ్లపాటు విధులు నిర్వహించిన అజాజుల్ల ఖాన్లకు పరిపాలనా భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు శాలువాలు కప్పి జ్ఞాపికలు, పూలమొక్కలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. చిరంజీవి మాట్లాడుతూ, ఇద్దరు అధికారులు సింగరేణి అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. వారి సేవలు సంస్థకు ఆదర్శప్రాయమని పేర్కొంటూ పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంగా ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ మదన్ మోహన్ ఎస్టీపీపీ నిర్మాణంలో బీటీజీ ప్యాకేజీ పనులను సమర్థంగా పర్యవేక్షించి ప్లాంట్‌ను కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. యాష్ వినియోగాన్ని వంద శాతానికి చేర్చడం ఎఫ్‌జీడీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడం ప్లాంట్ నిర్వహణలో సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. అజాజుల్ల ఖాన్ సబ్ ఓవర్‌సీర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి అధికారిగా ఎదిగి భూపాలపల్లి మణుగూరు ప్రాంతాల్లో భారీ స్థాయిలో క్వార్టర్ల నిర్మాణాన్ని పూర్తి చేయించారని ఎస్టీపీపీలో ఎఫ్‌జీడీ ప్రాజెక్టు సీఎస్‌ఆర్ పనులు ఇతర నిర్మాణ కార్యక్రమాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఇద్దరితో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం శాలువాలు కప్పి జ్ఞాపికలు పూలమొక్కలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎం ఎం. నరసింహరావు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సీహెచ్. సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు డి.పంతుల, ఏజీఎంలు, డీజీఎంలు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల పరిశీలనలో తెగిపోయినా రెంకొని వాగుపై తాత్కాలిక వంతెన సందర్శన

**– మైనార్టీ స్కూలు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి**

**– జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్ర ఆదేశాలు**





**ఖానాపూర్ జూలై 31(ప్రజా జ్యోతి) :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వరదల ప్రాంతాల్ని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం పర్యటించారు. ఈ మేరకు ఖానాపూర్ పట్టణం సుభాష్ నగర్ కాలనీ 12వ వార్డులోగల రెంకొని వాగు తాత్కాలిక వంతన భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోగా ఆ వంతెనను పరిశీలించి కలెక్టర్ భవేష్ మిశ్రా ఈ సందర్భంగా మాట్లాడుతూ వాగు అవతలి ఒడ్డున గల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని పాఠశాలకు సంబంధించిన అధికారులను పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు రానున్న రోజుల్లో వంతెన పరిష్కారానికి శాశ్వత కృషి జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి చిన్నం సత్యనారాయణ, తొడసం ఇందిరా మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ఎమ్మార్వో సుజాత ఎంఈఓ సంధ్య రాణి ఆర్ ఐ నగేష్ నాయకులు గొర్రె గంగాధర్ ప్రకాష్ గౌడ్ లాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారుపట్టణ ప్రజా ప్రతినిధులు వరద ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి నివేదికలను సంబంధిత అధికారులకు తెలిపి తాత్కాలిక సహాయ సహకారాలు కల్పించుకోవాలని తెలిపారు.

## ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి







**– అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలి**

**– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**కడెం, జులై 31(ప్రజా జ్యోతి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడెం ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం, ప్రస్తుత నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న రోజుల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల గ్రామాల ప్రజలకు నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాజెక్టు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు, నీటి ప్రవాహ ప్రాంతాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లోకి అనధికార వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులో నీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఖానాపూర్ పట్టణంలోని హైటెక్ సిటీ మైనారిటీ వసతి గృహానికి వెళ్లే మార్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిత్యావసర వస్తువులు, అవసరమైన సామగ్రిని నిరంతరం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ అధికారులు జగదీష్, రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ కుమార్, వీరన్న, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహశీల్దార్లు ఖాజా మొయినుద్దీన్, సుజాత, ఎంపీడీఓ రాధా రాథోడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు శ్రీకారం



- జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- తల్లిపాలు బిడ్డకు అమృతం – తల్లికి కూడా ఆరోగ్య రక్షణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

**మంచిర్యాల, 31, జూలై (ప్రజాజ్యోతి) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మాతా–శిశు సంరక్షణ కేంద్రాలు, గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు, జాతీయ టీకా కార్యక్రమం నిర్వహించే కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని కోరారు. డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ "తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలి. బిడ్డకు ఎంత ఎక్కువగా తల్లిపాలు ఇస్తే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయి" అని తెలిపారు. తల్లిపాల వల్ల శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు నీళ్ల విరేచనాలు, నిమోనియా, మధుమేహం, అలర్జీలు వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. తల్లి–బిడ్డల మధ్య అనుబంధం బలపడటంతో పాటు పిల్లల్లో జ్ఞాపకశక్తి, చురుకుదనం, కంటి చూపు మెరుగుపడి భద్రతాభావం పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ల ప్రమాదం తగ్గడంతో పాటు మధుమేహం, అధిక బరువు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు దూరమవుతాయని పేర్కొన్నారు. ప్రసవానంతరం రక్తస్రావం తగ్గి రక్తహీనత నివారించబడటంతో పాటు గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవడానికి తల్లిపాలు దోహదపడతాయని చెప్పారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ విధానంగా కూడా తల్లిపాలు ఉపయోగపడతాయని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన "విజయవంతమైన తల్లిపాల కోసం 10 సూత్రాలు" తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. గర్భిణీ స్త్రీలకు ముందుగానే తల్లిపాల నిర్వహణపై అవగాహన కల్పించాలని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడానికి సహకరించాలని, వైద్యపరమైన అవసరం ఉంటే తప్ప తల్లిపాలు తప్ప ఇతర ఆహారం లేదా ద్రవాలు ఇవ్వకూడదని తెలిపారు. బిడ్డ కోరిన ప్రతిసారి తల్లిపాలు ఇవ్వాలని ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో తల్లులు, కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విశ్వేశ్వర్ రెడ్డి, డీపీఓ శ్రీమతి ప్రశాంతి, బసుమతి సుమన్ తదితరులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నెల రోజుల పాటు ప్రత్యేక నిషేధాజ్ఞలు

**– బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు – డీజేలు, అనుమతి లేని డ్రోన్లపై కఠిన నిఘా**

**– ర్యాలీలు, ధర్నాలు, సభలకు ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరి – పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, 31, జూలై (ప్రజాజ్యోతి) :** రామగుండం పోలీస్ కమిష నరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడం, డ్రోన్లు ఎగరవేయడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మరో నెలపాటు కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. మంచి ర్యాల, పెద్దపల్లి జోన్‌లలో కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో రహదారులు, వీధుల్లో అసభ్యంగా ప్రవర్తించడం వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు.

ఈ నిషేధాజ్ఞలు 2026 ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి మరింత కాలం పొడిగించే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్--223, హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం--1348 ఫసలీ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజేలు, డ్రోన్లపై కఠిన నిఘా........:** శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధాన్ని కూడా కొనసాగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్ర మాల్లో మైక్ సెట్ వినియోగించాల్సి వస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనుమతి లేకుండా డ్రోన్లు వినియోగించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**ర్యాలీలు, ధర్నాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి........:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2026 ఆగస్టు 1 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 1 ఉదయం 6 గంటల వరకు సిటీ పోలీస్ చట్టం--2016, హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం--1348 ఫసలీ, పోలీస్ చట్టం--1861 నిబంధనల మేరకు ప్రత్యేక నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే సంబంధిత పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. బంద్‌ల పేరిట కార్యాలయాలు, సంస్థలను బలవంతంగా మూసివేయించడం, ఇతరులను బెదిరించడం లేదా ఒత్తిడి చేయడం వంటి చర్యలపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.

## వాగు ఉప్పొంగితే... రాకపోకలు బంద్!

### బ్రిడ్జి ఎత్తు పెంచి మా ఇబ్బందులు తీర్చండి: లింగట్ల పంచాయతీ గిరిజనుల వేడుకోలు



**నేరడిగొండ, జులై 31 (ప్రజా జ్యోతి) :** మండలంలోని లింగట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల గోండుగూడ, చింతగూడ, నందన్ తండా గ్రామాల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక వాగుపై ఉన్న బ్రిడ్జి (కాజ్‌వే) ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షపు నీరు బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటం వల్ల వరద నీరు త్వరగా తగ్గక, రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. గ్రామానికి రావాల్సిన ఆటోలు, ఇతర అత్యవసర వాహనాలు రాలేకపోవడంతో స్థానికులు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి అవస్థలు పడుతున్నారు.

**ఆసుపత్రికి వెళ్లాలంటే నరకయాతన :** ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పగటి పూట జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నాయి. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా, కాన్పుల కోసం గర్భిణులను ఆసుపత్రికి తరలించాలన్నా వర్షపు నీరు తగ్గే వరకు రోజంతా నిరీక్షించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ కష్టాలను గుర్తించాలని, ఎత్తు తక్కువగా ఉన్న బ్రిడ్జి స్థానంలో నూతనంగా ఎత్తైన బ్రిడ్జిని నిర్మించి తమ రవాణా కష్టాలను తీర్చాలని స్థానిక గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వాగ్దారి గ్రామంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

### అంటరానితనం, బాల్య వివాహాలను అరికట్టాలి..వీఆర్వో రాజారాం



**నేరడిగొండ, జూలై 31 (ప్రజా జ్యోతి) :** మండలంలోని వాగ్దారి గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పౌర హక్కులు, సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించారు. అంటరానితనం నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై అధికారులు ప్రజలకు సమగ్రంగా వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంటరానితనం, బాల్యవి వాహాలు, బాలకార్మిక వ్యవస్థ వంటి సామాజిక దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే మూఢనమ్మకాలను వీడి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ విజయ్, ఉపసర్పంచ్ సోయం లక్ష్మణ్, మండల గిర్దావర్ సాయిరాం, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో) ఆడెపు రాజారామ్, పిస్క వెంకటరమణతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలి

### సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి




**మంచిర్యాల, 31, జూలై (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడకుండా ప్రతిరోజూ కనీసం 28 నుంచి 32 రేకుల ద్వారా నాణ్యమైన బొగ్గు రవాణా జరిగేలా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు, బొగ్గు నాణ్యత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశమున్నప్పటికీ, ముందస్తు చర్యలతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా సాధించాలని సూచించారు. అలాగే భూగర్భ గనుల్లో ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రస్తుతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 75 నుంచి 80 శాతం బొగ్గు సరఫరా చేస్తున్నట్లు సీఎండీ తెలిపారు. ఈ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు అన్ని ఏరియాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఉన్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సింగరేణి రెస్క్యూ బృందాలు, అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాలను పూర్తిచేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగింపు లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (పీ అండ్ పీ), గౌతమ్ పోట్రు (పర్సనల్ – ఫైనాన్స్), ఎం. తిరుమలరావు (ఈ–ఎం), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ , మార్కెటింగ్) టి. శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ విభాగాల జీఎంలు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి టౌన్ హాల్

- పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కొత్త భవనంలోనే నిర్వహించాలని సూచన

వనపర్తి ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి): వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో నిర్మించిన టౌన్ హాల్‌లో మిగిలిన పనులను నెల రోజుల్లో పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టౌన్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశమై పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



టౌన్ హాల్‌లో సౌండ్ ప్రూఫింగ్ పనులు వచ్చే నెలలోగా పూర్తిచేయడంతో పాటు ఫర్నిచర్ ఏర్పాటు, భవనం పరిసరాల్లో పచ్చదనం, పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేసి నెల రోజుల్లో టౌన్ హాల్‌ను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రాబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని కొత్త టౌన్ హాల్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. పాత యూకో బ్యాంకు సమీపంలో, జిల్లా గ్రంథాలయ ఆవరణ వద్ద నిర్మించిన డ్రైనేజీ పనులు, సూర్య చంద్ర పాఠశాల రోడ్డులో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల నాణ్యతను తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జిల్లా అగ్రస్థానమే లక్ష్యం: కలెక్టర్

- స్లో లెర్నర్లపై ప్రత్యేక ఫోకస్

వనపర్తి ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి): వచ్చే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ఆగస్టు 12లోగా అందించి, ఆబ్జెక్టివ్ పరీక్షల ద్వారా స్లో లెర్నర్లను గుర్తించి మూడు నెలల పాటు



ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. తరచూ పరీక్షలు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో ఫెయిల్యూర్ లేకుండా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో గ్యాస్ వినియోగం, నాణ్యమైన ఆహారం, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## తెలంగాణ ఉద్యమకారుడు పెద్దికి ఘన నివాళులు

-పెద్ది సేవలు ప్రజల మనసుల్లో జీవిస్తూనే ఉంటాయి: బిఆర్ఎస్ నేతలు

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 31 (ప్రజా జ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందడంతో తెలంగాణ నర్సంపేట సమాజానికి తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మక్తల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని నారాయణ పేట చౌరస్తా లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు,నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలదండ సమర్పించి 2నిమి,లు మౌనం పాటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో నర్సంపేటలో



శోకసంద్రంలో మునిగిందని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో తెలంగాణ ఉద్యమ నేత కేసిఆర్ అడుగుజాడల్లో నడుస్తూ తనను గెలిపించిన ప్రజలకు ఏదో చేయాలని తపనతో పోరాడిన వ్యక్తి చనిపోవడం పట్ల తాము చింతిస్తున్నామని,నాయకులు మరణించరు వారి సేవలు,వారి విలువలు ప్రజల మనసుల్లో జీవిస్తూనే ఉంటాయి అని పెద్ది సుదర్శన్ రెడ్డిని కోల్పోయి శోక తప్త హృదయులైవున్న పెద్ది కుటుంబానికి పార్టీ అధినేత, పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మక్తల్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా,మక్తల్ బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఏ.మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.నర్సింహాగౌడ్,మక్తల్ బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు జె.చిన్నహన్మంతు, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ మాజీ అధ్యక్షులు గార్లపల్లి నర్సింహారెడ్డి,గుర్లపల్లి సర్పంచ్ గాల్ రెడ్డి,టేకులపల్లి సర్పంచ్ శ్రావణ్ కుమార్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు జుట్ల.శంకర్,సుధాకర్ రెడ్డి,డాక్యుమెంటరీ రవికుమార్,ఎలిగేండ్ల బాలప్ప,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జుట్ల.సాగర్,నేతాజీ రెడ్డి,శివారెడ్డి,రాజు,చందాపూర్ అశోక్ గౌడ్,గుర్లపల్లి అశోక్,మామిళ్ల అంబ్రెష్,కాచవర్ అశోక్,ఎన్.బి నాయుడు, భాస్కర్,కర్రెమ్ అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

## దోమలపై దండయాత్ర.. డ్రైనేజీలపై కలెక్టర్ సడన్ చెక్!

- ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి
- నీటి నిల్వలు, చెత్త తొలగింపుపై అధికారులకు ఆదేశాలు
- డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

వనపర్తి ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి): పురపాలికల్లో దోమల వ్యాప్తికి కారణమయ్యే నీటి నిల్వలను వెంటనే తొలగించి, డ్రైనేజీలు, కాలువలు, పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని తెలుగువాడ ప్రాంతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలనీలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, పరిశుభ్రత చర్యలను పరిశీలించిన కలెక్టర్.. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దోమల పెరుగుదలకు దారితీసే నీటి నిల్వలను పూర్తిగా తొలగించడంతో పాటు డ్రైనేజీలు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. కాలనీలు, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా సకాలంలో తొలగించి పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని పేర్కొన్నారు.
నిరంతర పర్యవేక్షణతో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.




ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించిన వారినే ఓటరు జాబితాలో నమోదు చేస్తాం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల,జూలై 31(ప్రజా జ్యోతి ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా పూరించి సమర్పించినప్పుడే ఎలక్టోరల్



రోల్‌లో ఓటరుగా నమోదు చేయబడతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.శుక్రవారం గద్వాల పట్టణంలోని 17వ,వార్డు భీమ్‌నగర్,రెవెన్యూ కాలనీల పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెం. 256లో,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య,పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు,ఓటర్ల నుంచి తిరిగి స్వీకరించిన పూరించిన ఫారాల సంఖ్య,డిజిటలైజేషన్ శాతం వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆగస్టు 3వ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున,ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ఫారాలు స్వీకరించాలని బీఎల్ఓలకు సూచించారు.మరణించిన ఓటర్లు,ద్వంద్వ ఓట్లు కలిగిన వారు,చిరునామా మారిన వారు,వలస వెళ్లిన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు.కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. పారదర్శకంగా,తప్పులేని ఓటరు జాబితాల రూపకల్పనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ,ఉప తహసీల్దార్ అజిత్,సూపర్వైజర్ తిమ్మప్ప,బీఎల్ఓ సునీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

- గిరిజన గురుకులం, ఏరియా ఆసుపత్రిలో సమస్యలపై ఆరా.. వెంటనే పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జడ్చర్ల మండలంలో ఆకస్మికంగా పర్యటించి తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల, జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,





పలుచోట్ల ఫ్యాన్లు పనిచేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పనిచేయని ఫ్యాన్లను అదే రోజు సాయంత్రంలోపు మరమ్మతు చేయాలని ఆదేశించారు. కిటికీల మరమ్మతులు, దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు అత్యవసరంగా సిద్ధం చేసి అనుమతుల కోసం ఫైల్ పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే గ్రామపంచాయతీ ద్వారా వెంటనే ఫాగింగ్ నిర్వహించి దోమల నిర్మూలన చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ప్రధాన కారిడార్, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ కనీసం మూడు సార్లు శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహిస్తూ పారిశుధ్యాన్ని అత్యున్నత స్థాయిలో కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. లేబర్ రూమ్, ప్రసూతి వార్డును పరిశీలించిన కలెక్టర్ బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆసుపత్రి


ఆసుపత్రిలో పారిశుధ్యం, రోగులకు అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి లోపాలపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన మినీ గురుకుల పాఠశాలలో సిబ్బంది హాజరు రిజిస్టర్, తరగతి గదులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ నాలుగో తరగతి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ అమలు, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దోమల సమస్య తీవ్రంగా ఉందని, కొన్ని తరగతి గదుల కిటికీలకు తలుపులు లేవని,

అధికారులకు సూచించారు. తదనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాత బజార్‌లో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. మహమ్మద్ అర్షదుల్ల తదితర అధికారులు పాల్గొన్నారు.

## హైకోర్టు ప్రశ్నించినా అధికారుల మౌనం..!

-హైకోర్టు ప్రశ్నించినా అధికారుల మౌనం..!
- అనుమతుల్లేని డిస్ట్రిక్ట్ క్లబ్ భవనంపై హైకోర్టు నోటీసులు
- ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు
- అధ్యక్ష, కార్యదర్శులకు వ్యక్తిగత నోటీసులు... ఆగస్టు 19కి తదుపరి విచారణ
- "అక్రమ నిర్మాణం కూల్చేవరకు న్యాయ పోరాటం ఆగదు" - సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్

మహబూబ్‌నగర్, జూలై 31(ప్రజాజ్యోతి బ్యూరో ) జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ క్లబ్ ప్రాంగణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ బహుళ అంతస్తుల భవనం నిర్మాణం కొనసాగుతుండగా, సంబంధిత ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం ఇప్పుడు హైకోర్టు దృష్టికి చేరింది. ఈ వ్యవహారంలో డిస్ట్రిక్ట్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శికి వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించగా, తదుపరి విచారణను ఆగస్టు 19కు వాయిదా వేసినట్లు సామాజిక కార్యకర్త, నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండానే సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రత్యేకంగా జిల్లా కోర్టు, అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం వంటి అత్యంత భద్రతా ప్రాధాన్యం కలిగిన ప్రభుత్వ కార్యాలయాల మధ్య ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన



ప్రశ్నించారు. ప్రజలపై మాత్రం నిబంధనలు కఠినంగా అమలు చేసే అధికారులు, ఈ నిర్మాణం విషయంలో ఎందుకు మౌనం వహించారని నిలదీశారు. అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేసి కూల్చివేయాలని కోరుతూ తాము హైకోర్టును ఆశ్రయించామని, విచారణ సందర్భంగా ప్రభుత్వమే నిర్మాణానికి అనుమతులు లేవని కోర్టుకు తెలియజేసిందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. దీంతో "అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారు?" అంటూ హైకోర్టు ప్రశ్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శికి వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించిందని, తదుపరి విచారణను ఆగస్టు 19కు నిర్ణయించిందని చెప్పారు. న్యాయవ్యవస్థపై



తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఈ వ్యవహారంలో న్యాయం తప్పకుండా జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డిస్ట్రిక్ట్ క్లబ్ నూతన భవనం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించబడుతోందని ఆరోపించిన దిడ్డి ప్రవీణ్ కుమార్, ప్రభుత్వం వెంటనే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణం తొలగించే వరకు తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## బిఎల్ఓలకు ఘన సన్మానం

- బిఎల్ఓలను అభినందించిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 31 (ప్రజా జ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ పరిధిలోని 147,149వ పోలింగ్ బూత్ పరిధిలో 100% ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి ఆధ్వర్యంలో బీఎల్ఓలు శోభమ్మ,లక్ష్మీ లను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ప్రతి



ఇంటికి విధిగా చేరుకొని ఎస్ ఐ ఆర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి పూర్తి వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి ప్రక్రియను బిఎల్ఓలు విజయవంతం చేశారన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, గ్రామస్తులు బాలచంద్రా రెడ్డి, అజయ్, రాము, ప్రభాకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## "ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం"జూరాల వద్ద వరద పరిస్థితులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

గద్వాల,జూలై 31(ప్రజా జ్యోతి ప్రతినిధి): వర్షాలు,వరదల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం ఎస్పీ టి.శ్రీనివాసరావు అదనపు ఎస్పీ కె.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్యతో కలిసి జూరాల ప్రాజెక్టును సందర్శించి కృష్ణా నదికి కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని,ప్రాజెక్టులోని నీటి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు ప్రస్తుత ఇన్‌ఫ్లో,అవుట్‌ఫ్లో,ఎత్తిన గేట్లు, భవిష్యత్‌లో ఏర్పడే పరిస్థితులపై ఎస్పీకి వివరించారు.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు సుమారు 1.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,1,15,515 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల





చేస్తున్నట్లు తెలిపారు.ప్రాజెక్టులో మొత్తం 64 గేట్లు ఉండగా,ప్రస్తుతం 24 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,కృష్ణా నదికి వరద ప్రవాహం పెరగడం,భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్తు ఎదురైనా ప్రజలను రక్షించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు.కర్ణాటక నుంచి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ఆరు గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశముందని,ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.వరదలు,భారీ వర్షాల సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,రెవెన్యూ, నీటిపారుదల తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.అవసరమైతే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి,ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు,అదనపు ఎస్పీ కె.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య,ఏఈలు సుదర్శన్,సిద్దయ్య,కిషోర్ కుమార్,గద్వాల రూరల్ ఎస్ఐ సీహెచ్.శ్రీకాంత్,ధరూర్ ఎస్ఐ నందికర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దూర్‌లో పోలీసు మౌలిక వసతుల అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష

నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూలై 31:మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సదుపాయాల అభివృద్ధి, గుండుమల్ మరియు కొత్తపల్లి నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.తిరుపతిరెడ్డి,



పోలీసు అధికారులు పాల్గొన్నారు. మద్దూర్ కేంద్రంగా మూడు పోలీస్ స్టేషన్లలో అవసరమైన సౌకర్యాల ఏర్పాటు, భవనాల నిర్మాణం,సిబ్బంది అవసరాలు, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం మద్దూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత భవనాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు.పోలీసు శాఖలో ఎస్సై,కానిస్టేబుల్ నియామకాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉచితంగా చదువుకునేందుకు లైబ్రరీతో పాటు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్, రోజువారీ వార్తాపత్రికలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆకాంక్షించారు.

# వ్యాధుల ముప్పు.. అప్రమత్తతే రక్షణ

- వర్షాకాలంలో పెరుగుతున్న సీజనల్ జ్వరాలు
- పరిశుభ్రతతోనే వ్యాధులకు చెక్, వైద్యుల సూచన





**భీమదేవరపల్లి, జూలై 31 (ప్రజాజ్యోతి) :** వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు క్రమంగా విజృంభిస్తున్నాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిల్వ ఉండటం, మురుగు కాల్వలు సక్రమంగా ప్రవహించకపోవడం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం వల్ల దోమలు, ఈగలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. స్వల్ప జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి లేదా సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. సొంతంగా మందులు వాడడం వల్ల సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు :** సీజనల్ వ్యాధులను అరికట్టే లక్ష్యంతో మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో సర్పంచ్ అజయ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మధుతో కలిసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బయో లార్విసైడ్స్, దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్నారు. వీధులు, కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్ర వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు.

**తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు :**

- కాచి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలి.
- ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి.
- ప్రతి ఇంట్లో దోమతెరలు లేదా దోమ నివారణ పరికరాలు వినియోగించాలి.
- వేడివేడి, తాజాగా వండిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకుంటూ రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి.
- ఇంటి ఆవరణలో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలి.
- జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**జాగ్రత్తలు పాటించాలి :** "వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పరిశుభ్రమైన పరిసరాలు, సురక్షితమైన తాగునీరు, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను చాలా వరకు నివారించవచ్చు. జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నాం."

– డాక్టర్ రెహమాన్, వైద్యాధికారి, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి చల్లా ధర్మారెడ్డి ప్రగాఢ సంతాపం..



**పరకాల, జూలై 31 ప్రజాజ్యోతి :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొని, తెలంగాణ ఆకాంక్షల సాధనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ప్రజానాయకుడిగా ఆయన చిరస్మరణీయులని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణ సమాజానికి, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు చల్లా ధర్మారెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల టౌన్ ప్రమాణ స్వీకారోత్సవం




**కొడకండ్ల, జూలై 31 (ప్రజాజ్యోతి) :** లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల 2026-27 సంవత్సరానికి నూతన అధ్యక్షుడు పసునూరి మధుసూదన్, సెక్రెటరీ.విశ్వనాధుల.గ్యానేశ్వర చారి, ట్రెజర్.పసునూరి. నవీన్ కుమార్ ఏకగ్రీవం ఎన్నికై శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. డిస్టిక్ గవర్నర్ యన్.సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేస్తూ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 10 మంది నూతన సభ్యులను చేర్పించడం జరిగింది. సేవా కార్యక్రమాలలో భాగంగా మొదటగా శుక్రవారం కొడకండ్ల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జవ్వాజి.సంజన కు ఉన్నత విద్యను అభ్యసించడానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల టౌన్ తరపున రూ.60000 చెక్కు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, ఇన్స్టలేషన్ అధికారి ,లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో

# 99.79 శాతం డిజిటలైజేషన్ పూర్తి

- రాష్ట్రంలో తొలి స్థానంలో జనగామ జిల్లా - కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో భాగంగా జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక ఎస్.ఐ.ఆర్ హేతుబద్ధీకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 99.79 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తికావడంతో రాష్ట్రవ్యాప్తంగా జనగామ జిల్లా తొలి స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించడమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ ప్రక్రియలో నమోదు చేసిన ప్రతి వివరాన్ని నిబంధనలకు అనుగుణంగా పరిశీలిస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియపై సమగ్రంగా వివరించారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఓటరు సులభంగా చేరుకునే విధంగా రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదు కాకుండా అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం ఫ్యామిలీ కార్డ్ ఆధారంగా కుటుంబ వివరాలను సమగ్రంగా పరిశీలిస్తూ, అవసరమైన మార్పులు చేపట్టాలని వివరించారు. జిల్లాలో నివాసం మార్చుకున్న షిఫ్టెడ్ ఓటర్ల వివరాలను కూడా ప్రత్యేకంగా గుర్తించి, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అనుగుణంగా ఓటరు జాబితాలో అవసరమైన సవరణలు చేపట్టాలని తెలిపారు. దీని ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును సులభంగా వినియోగించుకునే అవకాశం కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న 13 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటి హేతుబద్ధీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పూర్తి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, ఘనపూర్ స్టేషన్ ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి రావెల రవి, బీజేపీ పార్టీ ప్రతినిధి పి. జగదీశ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు బి. భాస్కర్, యు. రవి యాదవ్, సీపీఎం పార్టీ ప్రతినిధి జోగు ప్రకాష్, టీడీపీ పార్టీ ప్రతినిధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- గోపరాజుపల్లి యూపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**జనగామ జిల్లా ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జనగామ మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలోని ఉన్నత ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, విద్యా బోధన, మౌలిక వసతులు, పరిశుభ్రత, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శిస్తూ, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి అభ్యాస సామర్థ్యాలను పరీక్షించారు. 4వ తరగతిలో తెలుగు పాఠ్యాంశానికి సంబంధించిన పాఠాలను విద్యార్థులతో చదివించి, వారి పఠన నైపుణ్యాలను పర్యవేక్షించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ స్పష్టంగా చదివేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 1వ తరగతి విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం బలోపేతంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 3వ తరగతిలో ఉపాధ్యాయుడి బోధనను ప్రత్యక్షంగా పరిశీలించి, అభినందించారు. ఆంగ్ల భాషలో "వైల్డ్ ఎనిమల్స్ అంశాన్ని కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా బోధిస్తూ, ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందాయా,లేదా అనే విషయాన్ని కూడా ఆరా తీశారు. 5వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, కొత్త పాఠ్య పుస్తకాలు అందాయా అని అడిగి, విద్యార్థులు ప్రతిరోజూ మంచిగా చదువుతూ, ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. 6వ, 7వ తరగతి గదిని సందర్శించి, విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ప్రస్తుతం 28 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుసుకొని, మరింత మంది పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు గణేష్ కు సూచించారు. పాఠశాల వంట గదిని పరిశీలించి, మధ్యాహ్న భోజన తయారీ, పరిశుభ్రత, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల గురించి ఆరా తీసిన కలెక్టర్, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. అలాగే పాఠశాల భవనంలోని తరగతి గదుల కిటికీలు, లైట్ల మరమ్మతులు చేయడంతో పాటు భవనానికి వైట్ వాష్ చేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అదే పాఠశాలలో నిర్వహిస్తోన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న సేవలు, పోషకాహార పంపిణీ, కేంద్రం నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని అన్నారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు తప్పనిసరిగా అలవర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పష్టం చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి






## కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..

**హనుమకొండ, జిల్లా ప్రతినిధి జూలై 31 (ప్రజాజ్యోతి) :** ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వేడుకల ఏర్పాట్లను శాఖలవారీగా సమీక్షించిన కలెక్టర్, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట అతిథులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేదిక, జాతీయ పతాకావిష్కరణ, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉత్తమ శకటాలు, ఆకర్షణీయమైన స్టాల్స్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు తెలియజేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వేడుకల నిర్వహణలో పాల్గొనే ప్రతి శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, అదనపు కలెక్టర్లు రవి, శేషాద్రి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, డీఆర్డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి



- రైతులకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి) :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం, జిల్లాలోని బచ్చన్నపేట మండలం, ఎద్దుగూడెం గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. గ్రామంలో సాగు పరిస్థితులు, పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రైతు బండారి బాలరాజు సాగు చేసిన పెసర, నువ్వుల పంటలను పరిశీలించి, ఎన్ని ఎకరాల్లో నువ్వులు, పెసర పంట వేశారు అని అడుగగా, రైతు తన పొలంలో మూడున్నర ఎకరాల్లో నువ్వుల పంట, ఐదు ఎకరాల్లో పెసర పంట సాగు చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించారు. పంటల పెరుగుదల, సాగు ఖర్చు, ఆశిస్తున్న దిగుబడుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. గతంలో వరి సాగు చేసినప్పుడు వచ్చిన ఆదాయం, ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల ద్వారా పొందుతున్న లాభాలపై రైతుతో చర్చించారు. రైతుల అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసి, వరి సాగుకు బదులుగా పెసర, నువ్వులు, కందులు, మిర్చి, బెండ, వాక్కాయలు వంటి ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ఈ పంటలు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలమని పేర్కొన్నారు. గ్రామంలో సమీకృత వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తున్న రైతు పరమేశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. డ్రమ్ సీడింగ్ పద్ధతిలో సాగు, వివిధ పంటల సమీకృత సాగు, ఆదాయ వనరుల వైవిధ్యీకరణ వంటి అంశాలను పర్యవేక్షించి, అభినందించారు. ఇలాంటి నమూనా వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలతో కలెక్టర్ మాట్లాడి, వారి ఉపాధి పరిస్థితులు, కూలీ వివరాలు తెలుసుకున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల అభిప్రాయాలను తెలుసుకుంటూ, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు, పంటల వైవిధ్యీకరణ, ఎల్‌నినో కంటింజెన్సీ కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలోని ప్రతి రైతుకు ఆరుతడి పంటల ప్రాధాన్యాన్ని వివరించి, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని గ్రామ సర్పంచ్ కు తెలిపారు. గ్రామ సభ నిర్వహించి, రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎన్ఆర్ఎల్ఎమ్ పథకాల కింద గ్రామీణ రహదారులు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టి, గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆరుతడి పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని కాపాడటంతో పాటు వ్యవసాయాన్ని స్థిరంగా కొనసాగించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ సూచనలను పాటిస్తూ, పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ అమలు హర్షణీయం..

- ఐఆర్‌సీఎస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి) :** తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు ఆగస్టు 15 నుంచి పెన్షన్ అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఐఆర్‌సీఎస్ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. 2018లో ఈ పెన్షన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ అమలుకు నోచుకోలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. నిరంతర వైద్య చికిత్సలు, రక్త మార్పిడి, మందుల కోసం భారీ ఖర్చులు భరిస్తున్న బాధితులకు ఈ పెన్షన్ ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, సహకరించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి సీతక్కలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో రాష్ట్ర స్థాయి గుర్తింపు..

ఆర్డీవో డి.ఎస్.వెంకన్నకు ఘన సత్కారం..



**పరకాల, జూలై 31 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరకాలలో విజయ వంతంగా 100 శాతం పూర్తి చేసి రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన సందర్భంగా పరకాల ఆర్డీవో డి.ఎస్. వెంకన్నను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరకాల ఎస్ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలో రెండో స్థానం సాధించడంపై సమావేశంలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంతిలాల్ ఆధ్వర్యంలో ఆర్డీవో డి.ఎస్.వెం కన్నను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సహకారం, అధికారుల సమిష్టి కృషితో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతమైందని పేర్కొన్నారు. పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందిస్తూ ఈ విజయాన్ని సాధించిన అధికారులు, సిబ్బంది అభినందనీయులని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఆర్డీవో డి.ఎస్. వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు..

- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 31 (ప్రజాజ్యోతి) :** ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు. జన్మించిన శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రసవం అనంతరం వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు అత్యంత విలువైనవని, వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు, ఐరన్ సమృద్ధిగా ఉండి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు శిశువును కామెర్లు, విరేచనాలు వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. తల్లిపాలు శిశువుకు సహజమైన, సురక్షితమైన, సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు శారీరకంగా, మానసికంగా మెరుగ్గా ఎదుగుతారని, శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, ఆస్తమా, చర్మవ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. అలాగే దవడల ఎదుగుదలకు కూడా తల్లిపాలు దోహదపడతాయని చెప్పారు. పాలిచ్చే తల్లులకు కూడా తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, రక్తస్రావం తగ్గడంతో పాటు తల్లి--బిడ్డ మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పగలు, రాత్రి కలిపి రోజుకు కనీసం 8 నుంచి 10 సార్లు బిడ్డకు పాలివ్వాలని సూచించారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, ఏడో నెల నుంచి తల్లిపాలతో పాటు రోజుకు మూడు సార్లు, 9 నుంచి 11 నెలల మధ్య రోజుకు నాలుగు సార్లు అదనపు పోషకాహారం అందించాలని తెలిపారు. బిడ్డకు పాలిచ్చేటప్పుడు తల, శరీరం ఒకే వరుసలో ఉండేలా ఒడిలో సౌకర్యవంతంగా పట్టుకుని, బిడ్డ నోరు పూర్తిగా చనుమొనను పట్టుకునేలా పాలివ్వాలని సూచించారు. ఒక్కో స్తనం నుంచి బిడ్డ పూర్తిగా పాలు తాగేందుకు సుమారు 20 నిమిషాల సమయం ఇవ్వాలని, అనంతరం మరో స్తనం నుంచి కూడా పాలివ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన లింగన్నకు నివాళులు

భూదాన్ పోచంపల్లి, జూలై 31 (ప్రజాజ్యోతి):
గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కామ్రేడ్ పూనం లింగన్న ఏడో వర్ధంతిని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం భూదాన్ పోచంపల్లి పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగన్న



చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి పగడాల శివ మాట్లాడుతూ, గిరిజనుల భూ హక్కులు, జీవనోపాధి కోసం లింగన్న చేసిన పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. గోదావరి లోయ ప్రాంతంలో ఆదివాసీల సమస్యలపై ఆయన నిరంతరం ఉద్యమించారని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లతో ఉద్యమాలను అణచివేయలేరని, లింగన్న ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు పోతగల నరసింహ, కొత్త బాబు, రచ్చ వెంకటేష్, పి. బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి కోర్టు నూతన భవనానికి అడుగులు వేగం..!

## బార్ అసోసియేషన్ కృషి ఫలించింది.. అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ హర్షం

తుంగతుర్తి, జులై 31,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రక్రియ వేగవంతమైందని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. జ్ఞానసుందర్ తెలిపారు. శుక్రవారం ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ ను కలిసి ఫైల్‌ను త్వరితగతిన పూర్తి



చేయాలని కోరగా, సంబంధిత ఈఈ శర్మకు వెంటనే ఫైల్ క్లియర్ చేసి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వం వారం రోజుల్లో టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని, అనంతరం 15 రోజుల్లో శంకుస్థాపన నిర్వహించి 18 నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత 15 రోజులుగా నల్లగొండ ఎస్‌ఈ కార్యాలయంలో ఫైల్ పురోగతి కోసం బార్ అసోసియేషన్ కార్యవర్గంతో కలిసి నిరంతరం కృషి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రోడ్లు–భవనాల శాఖ ఎస్‌ఈ, ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి జ్ఞానసుందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎండి పర్వీన్, జనరల్ సెక్రటరీ కారింగుల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎండి వజీర్, బాషబోయిన వేణురాజ్, బండారు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పే స్కేల్ అమలు చేయాలని బీవీజీ ఆర్ఎంజీ ఉద్యోగుల పెన్‌డౌన్ నిరసన

నడిగూడెం, జులై 31, ప్రజా జ్యోతి:
జేఏసీ పిలుపు మేరకు బీవీజీ ఆర్ఎంజీ ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్, షట్‌డౌన్ నిర్వహించి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క ప్రకటించిన పే



స్కేల్‌ను వెంటనే జీవో రూపంలో అమలు చేయాలని, 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఫుల్‌టైం ఉద్యోగులుగా మార్చాలని కోరారు. తమ డిమాండ్లపై ఎంపీడీవో మల్సూర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 1న సహాయ నిరాకరణ, ఆగస్టు 3న కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన, ఆగస్టు 4న ప్రజాభవన్‌లో మంత్రులను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రావు, శ్రీను, అంజిరెడ్డి, సతీష్, కృష్ణయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట, జూలై 31 (ప్రజా జ్యోతి) :
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనం పెల్లి గ్రామంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 6వ, 7వ, 8వ



తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. నాగమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ధనంపల్లిలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బోనాఫైడ్ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఆగస్టు 5వ తేదీ (బుధవారం) ఉదయం 10 గంటలకు తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. నాగమ్మ విజ్ఞప్తి చేశారు.

# అభాగ్య శవాల కోసం.. రెండు ప్రత్యేక గృహాల నిర్మాణం..!

## అద్దె ఇళ్ల బాధితులకు ఊరటగా స్మశానవాటికలోనే నిర్మాణానికి ఎమ్మెల్యే బిఎల్ఆర్ శ్రీకారం

మిర్యాలగూడ,జులై 31,( ప్రజాజ్యోతి ):
మానవత్వం లేని కాంక్రీట్ జనారణ్యాలుగా విరాజిల్లుతున్న... పట్టణాల్లో వేలాది రూపాయలు



అద్దెలు చెల్లిస్తున్నా.. విధివశాత్తు ఇంట్లో మనిషి చనిపోతే... మృతదేహాన్ని ఇంటి యాజమానులు కీడు అంటూ దరిదాపులకు రానివ్వరు... అవసరమైతే ఉన్నవారిని ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళమని నిర్ధాక్షణ్యంగా మాట్లాడుతారు... ఆ మృతదేహం ఉంచేందుకు గుప్పెడు జాగా కూడా కరువై... కుటుంబ సభ్యులు పడే ఆవేదన వర్ణనాతీతం... అలాంటి బాధలు తొలగించేందుకు ముందు చూపుతో మిర్యాలగూడ పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా... రెండు ప్రత్యేక గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు సామాజికవేత్త అయిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్). దీనిపై పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని హిందూ స్మశాన వాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా గతంలో జరిగిన కొన్ని సంఘటనలు ఆయనలో సమాజ హితమైన కొత్త ఆలోచనకు నాంది పలికాయి.అద్దె ఇళ్లలో నివాసముంటూ,కుటుంబ సభ్యుల మరణంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేందుకు పట్టణం లోని హిందూ స్మశాన వాటికలో రైస్ మిల్లర్ల సహకారంతోప్రత్యేకంగా రెండు గృహాలను నిర్మించనున్నట్లు ఆయన





సంచలన ప్రకటన చేశారు.అద్దె ఇళ్లలో ఉంటున్న కుటుంబాల్లో ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే ఇల్లు కీడు అవుతుందనే అంధవిశ్వాసాలతో యజమానులు మృతదేహాన్ని ఇంట్లోకి అనుమతించని సంఘటనలు ఇటీవల ఎంతోమందిని కలచివేశాయని కన్నవారినో , కట్టుకున్నవారినో కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలు,శవాన్ని రోడ్డుపై పెట్టుకుని నరక యాతన అనుభవించిన దయనీయపరిస్థితులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఇలాంటి అమానవీయసమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే తపనతోనే మానవతా దృక్పథంతో స్మశానవాటిక ఆవరణలోనే రెండు సకల సౌకర్యాలతో కూడిన గృహాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు బిఎల్ఆర్ తెలిపారు. మృతదేహాన్ని రోడ్లపై లేదా అనాథగా ఉంచాల్సిన అవసరం లేకుండా,అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు గౌరవప్రదంగా ఈ గృహాలలో ఉంచవచ్చ న్నారు.మరణించిన వారి కుటుంబసభ్యులు, బంధువులు వేచి ఉండటానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవ దానికి ఈ ఇళ్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ సామాజిక దృక్పథంతో కూడిన నిర్మాణానికి స్థానిక రైస్ మిల్లర్ల సహకారాన్ని సమీకరించి,త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్మశాన వాటికలో విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను వెంటనే తొలగించి, ఆవరణను ఎప్పటికప్పుడు అద్దంలా శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను, సిబ్బంది ని ఆదేశించారు. స్మశాన వాటికను అన్ని సౌకర్యా లతో వైకుంఠధామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు.ఈ కార్య క్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# నడిగూడెం మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం..

**ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి మండల ప్రజల ఘన కృతజ్ఞత**

**నడిగూడెం-మోతే వరకు కొత్త ఆర్టీసీ బస్సు సేవ ప్రారంభం.**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి పాలాభిషేకంతో కృతజ్ఞతలు**

**బస్సు సౌకర్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ పిలుపు**

**నడిగూడెం నుంచి మోతే వరకు బస్సులో ప్రయాణించిన ప్రజాప్రతినిధులు.**

**విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలకు రవాణా సౌకర్యం మరింత సులభం**

నడిగూడెం, జులై 31 ,ప్రజా జ్యోతి:
నడిగూడెం మండల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో మండలవ్యాప్తంగా ఆనందం వ్యక్తమైంది.
ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ పాల్గొని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేపూరి తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ, నడిగూడెం మండల ప్రజల రవాణా సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేక చొరవతో కోదాడ డిపో నుంచి నడిగూడెం మీదుగా మోతే వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం





కల్పించడం అభినందనీయమన్నారు. ఈ బస్సు సేవతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులు తమ విధులకు, రైతులు మార్కెట్ యార్డులకు, మహిళలు ఆసుపత్రులు మరియు ఇతర అవసరాల కోసం సులభంగా ప్రయాణించే అవకాశం కలిగిందన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమైనదని, తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థ అని పేర్కొన్నారు. బస్సు వెళ్లే గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని, ప్రయాణికుల ఆదరణ పెరిగితే భవిష్యత్తులో మరిన్ని బస్సు సర్వీసులు వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మండల ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేర్చిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో రవాణా సౌకర్యం కీలకమని, ఈ బస్సు సేవతో విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయ రంగాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు నడిగూడెం నుంచి మోతే వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొత్త బస్సు సర్వీస్ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూత్కూరి వెంకటరెడ్డి, వేల్పుల సోమయ్య, కంభంపాటి సరిత–చైతన్య, ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, బాణాల సతీష్ కుమార్, కాసాని మాధవి–గోపీనాథ్, కాంగ్రెస్ నాయకులు బాణాల నాగరాజ్, చిల్లంచర్ల సత్యనారాయణ, గుండు విజయరామారావు, పుట్ట చంద్రయ్య, పాతకోట్ల రాము, షేక్ మౌలానా, యలక శ్రీనివాస్ రెడ్డి, పల్లపు గోపాల్, అక్రమ్, వీరాచారి, దుర్గా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10వ తేదీన జరిగే జైల్ భరోను జయప్రదం చేయండి

## కొలిశెట్టి యాదగిరి రావు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు

తుంగతుర్తి, జులై 31,(ప్రజా జ్యోతి):
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు మరియు రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10వ తేదీన జరిగే జైలు భరోను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు పిలుపునిచ్చారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ టియర్ గ్యాస్ లు ప్రయోగించి దాడులు చేస్తుందని మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కానీ ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయకుండా ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు బానిస సేవలు చేపిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్కీము వర్కర్లను పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా అనేక రకాల భారం అవుతుందని



కేంద్రంలో సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. . దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ రైతులకు ఇచ్చే ఎరువులపై సబ్సిడీలను ఎత్తివేసిందని ఎరువుల ద్వారా విపరీతంగా పెంచిందని యూరియా సకాలంలో అందక రైతులు తీవ్రమైన ఇబ్బందిని ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం ద్వారా మోటార్లకు మీటర్ల ను పెట్టి రైతులకు కోలుకోలేని దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేక మార్కెట్లో సరైనటువంటి వసతులు లేకపోవడం సరుకులు అమ్ముకోలేని స్థితిలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకాన్ని వందరోజుల పని దినాలు కాకుండా 125 రోజులు కల్పిస్తామని చెప్పి 90 శాతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలకు 40 శాతం ఇవ్వాలనేటువంటిది జీవో తెచ్చి ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు దోదపడుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని పేరు మార్చి జిబిజి రాంజీ పథకంతో ప్రజల్ని కార్మికుల్ని మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఈరోజు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేసి ఉద్యోగాలు లేక యువకులు రోడ్డు మీదికి వచ్చి ధర్నా చేస్తే విచక్షణారహితంగా లాటి చార్జీలు వారు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అప్పుడు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైందని ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా యాప్ ద్వారా ఇవ్వడం వలన అవగాహన లేని రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే యాప్ ద్వారా ఇచ్చే పద్ధతిని రద్దు చేసి రైతులకు నేరుగా యూరియా అందించాలని కోరారు. ఇప్పటికే వర్షాలు సరిగా పడకపోవడం వల్ల రైతులు వేసుకున్న విత్తనాలు ఎండిపోవడం జరుగుతుందని వర్షం లేని మండలాలను గుర్తించి కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన ప్రజల బాధలు తీరడం లేదని ఎన్నికల ముందు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందుకే ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకొని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసి ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10వ తేదీన సిపిఎం పార్టీ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే జైలు మరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్ రెడ్డి,నాయకులు వజ్జే శ్రీను, పల్లా సుదర్శన్, బత్తుల జనార్ధన్, సిగ వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కో మొక్క.. భావితరాలకు వరం'.. తుంగతుర్తి సీఐ ఉపేందర్ రావు

## మూడు గ్రామాల్లో..300 మొక్కలు నాటిన తుంగతుర్తి పోలీసులు

తుంగతుర్తి, జులై 31,(ప్రజా జ్యోతి):
పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా తుంగతుర్తి మండల కేంద్రంతో పాటు, వెంపటి, గొట్టిపర్తి గ్రామాల్లో





శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ రావు, ఎస్సై క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థానిక ప్రజల సహకారంతో మూడు గ్రామాల్లో మొత్తం 300 మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ ముందుండి సేవలందిస్తున్న తుంగతుర్తి పోలీసుల చొరవను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మల్లెపాక సాయిబాబా, చిలకల వెంకన్న,తప్పట్ల ఎల్లయ్య, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ గురుస్వామి,పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, ఇతర గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు,వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.

# గీత కార్మికులకు ప్రకటించిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి

## గీతన్న ల రాష్ట్ర చైతన్య బస్సు యాత్ర గోడ పోస్టర్ ఆవిష్కరణ

తుంగతుర్తి, జూలై 31,(ప్రజా జ్యోతి):
గీత కార్మికులకు ప్రకటించిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలనీ కల్లుగీత కార్మికుల సంఘం తుంగతుర్తి మండల కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత



కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర" రాష్ట్ర బస్సు యాత్రకు సంబంధించిన గోడ పోస్టర్‌ను శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పులుసు వెంకటనారాయణ గౌడ్, మద్దెల నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.... ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. గీత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, ప్రమాద మరణ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడం, 50 ఏళ్లు పూర్తిచేసుకున్న గీత కార్మికులకు పెన్షన్ అందించడం, వృత్తి నిర్వహిస్తున్న ప్రతి గీత కార్మికుడికి కాటమయ్య రక్షణ కవచం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న గీతన్నల చైతన్య యాత్రను ప్రతి గీత కార్మికుడు తన సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు చిర్ర నరేష్ గౌడ్, తొట్ల సుధాకర్ గౌడ్, నగేష్, రమేష్, వగలగాని మల్లయ్య గౌడ్, తునికి నాగరాజు, బత్తుల శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### గంగారాం తండా గ్రామపంచాయతీ
## పరిధిలో వర్షాకాల వ్యాధుల నివారణపై అవగాహన

**ఇందల్వాయి,(ప్రజాజ్యోతి) జూలై 31:** ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారాం తండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఆశా వర్కర్ జ్యోతి ఆధ్వర్యంలో గ్రామంలో పరిశుభ్రత, వర్షాకాల వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ జ్యోతి





మాట్లాడుతూ, వర్షాకాలంలో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని, దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే దోమలు ఇళ్లలోకి రాకుండా కిటికీలు, తలుపులకు వలలు ఏర్పాటు చేసుకోవడం, దోమతెరలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తే వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పరిశుభ్రతకు సంబంధించిన సూచనలను పాటిస్తామని చెప్పడమైనది.

### విద్యార్థులకు గుడ్ న్యూస్
## నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

**నిజాంసాగర్ జూలై 31 ప్రజాజ్యోతి** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును ఆగస్టు 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. ముందుగా జూలై 31తో ముగియాల్సిన గడువును విద్యార్థుల సౌకర్యార్థం మరో వారం రోజుల పాటు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయంలో నాణ్యమైన ఉచిత విద్య,



వసతి, భోజనం తదితర సౌకర్యాలు కల్పించబడతాయని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను నవోదయ విద్యాలయం అధికారిక వెబ్‌సైట్ లేదా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ రాంబాబు వెల్లడించారు.

### భారీ వర్షాల నేపథ్యంలో
## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి
- లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 31:-** రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు





విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, పశుసంపద, పంటలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. త్రాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని, జిల్లాలో ప్రజలకు ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు చేయకుండా, భూగర్భ జలాల లభ్యత, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి పారుదల, అత్యవసర సేవలకు సంబంధించి ముందస్తు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, రాత్రికి రాత్రే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి మండలంలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకర చెరువులు, కాలువలు, కాజ్‌వేలు, ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### గన్నారం గ్రామంలో అంటరానితన
# నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

- అంటరానితనం అమానుషం అంటరానితనం పాటించిన వారు శిక్షింపబడుతారు

**ఇందల్వాయి (ప్రజా జ్యోతి), జూలై 31:** ఇందల్వాయి మండల కేంద్రంలోని గన్నారం గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ చట్టం--1955 ప్రకారం అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కుల వివక్షకు సమాజంలో తావులేదని, ప్రతి ఒక్కరూ సాటి మానవుని పట్ల సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామరస్యం, సామాజిక న్యాయం విలువలను కాపాడుతూ సమసమాజ స్థాపనకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులపై వివక్ష చూపడం చట్టవిరుద్ధమని తెలిపారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం--1955 ప్రకారం అంటరానితనం పాటించినా, కుల వివక్షకు పాల్పడినా సంబంధిత నిబంధనల మేరకు చర్యలు తీసుకోబడతాయని, నేరం రుజువైతే ఆరు నెలల వరకు కారాగార శిక్ష లేదా రూ.500 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. ప్రజలంతా కుల, మత భేదాలకు అతీతంగా పరస్పర



గౌరవం, సోదరభావంతో జీవిస్తూ సమాన హక్కులతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సుజాత శ్రీనివాస్. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ శంకర్. ఆనంద్ స్వామి తాసిల్దార్ బాలయ్య. ఎంపీడీవో అనంతరావు. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి సుమలత. గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్. ఉప్ప సర్పంచ్ కుమ్మరి వెంకట్. ఎర్ర సాయిలు జాజుల నరసవ్వ. పందెన గంగ భూదేవి. బైకాన్ లావణ్య. గోదాల మమత. దొండడి గణేష్. కొయ్యల మంజుల. రాజేందర్.





దోమకొండ మహేష్. టి సతీష్. ఎస్కే గౌస్. రాజేశ్వర్. ఎరుగు మోహన్ పంచాయతీ సెక్రటరీ కారోబార్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన సర్పంచ్ బీమాయల లక్ష్మీరాజు

- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ

**కామారెడ్డి ప్రతినిధి జూలై 31 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చిన్న మల్లారెడ్డి గ్రామంలో పలుచోట్ల నివాస గృహాలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల గోడలు పగిలిపోవడం, పైకప్పులు దెబ్బతినడం, వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ బీమాయల లక్ష్మీరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, గ్రామ జీపీఓ చిరంజీవి కలిసి దెబ్బతిన్న ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వర్షాల వల్ల ఎదురైన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద నష్టం వివరాలను నమోదు చేసి, సంబంధిత





అధికారులకు నివేదిక అందజేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, గృహ మరమ్మతుల సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీమాయల లక్ష్మీరాజు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబానికి గ్రామపంచాయతీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ, గ్రామంలో దెబ్బతిన్న ఇళ్ల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని, అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ జీపీఓ చిరంజీవి మాట్లాడుతూ, వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను




ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా అధికారుల తక్షణ స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం త్వరితగతిన నష్టపరిహారం మంజూరు చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

### సకాలంలో ఓ నెగటివ్ రక్తం అందించి
## మహిళ ప్రాణాలను కాపాడిన ఆర్ఎస్ఐ సాయి ప్రసన్న

- అత్యవసర వేళ మానవత్వాన్ని చాటిన పోలీసు అధికారి
- అభినందించిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 31 (ప్రజా జ్యోతి)** మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ కామారెడ్డి జిల్లా రిజర్వ్డ్ ఆర్ఎస్ఐ సాయి ప్రసన్న అత్యవసర సమయంలో ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేసి ఓ మహిళ ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. ప్రజల రక్షణ బాధ్యతలను నిర్వర్తించే పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూనే, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి వెంటనే స్పందించి రక్తదానం చేయడం పలువురి ప్రశంసలను అందుకుంటోంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇందిర (22) అనే యువతికి శస్త్రచికిత్స నిమిత్తం అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం అవసరమైంది. అయితే ఈ అరుదైన రక్తగ్రూపు జిల్లాలోని పలు రక్తనిధి కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరి ఆశగా ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలును సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే డాక్టర్ బాలు స్పందించి, రిజర్వ్డ్ ఆర్ఎస్ఐ సాయి ప్రసన్నను సంప్రదించారు. పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న సాయి ప్రసన్న ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే రెయిన్బో రక్తనిధి కేంద్రానికి చేరుకుని ఓ నెగటివ్ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. దీంతో బాధిత మహిళకు




సకాలంలో రక్తం అందించి శస్త్రచికిత్సకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, మానవ సేవే మహోన్నత సేవ అనే భావనతో స్పందించిన ఆర్ఎస్ఐ సాయి ప్రసన్న సేవాభావం నిజంగా అభినందనీయమన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూనే సామాజిక బాధ్యతను గుర్తించి అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. రక్తదాం చేయడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి



ఒక్కరూ నిరంతరం స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందిస్తూ ఎన్నో మంది ప్రాణాలను కాపాడేందుకు ఐవీఎఫ్ సేవాదళ్, రెడ్ క్రాస్ సంస్థలు నిరంతరం సేవలు అందిస్తున్నాయని, ప్రజలు కూడా అవసరమైన సమయంలో రక్తదాతలుగా ముందుకు వస్తే మరెంతో మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెయిన్బో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సైఫ్, బట్టు భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. అత్యవసర సమయంలో స్పందించి మహిళకు ప్రాణదాతగా నిలిచిన ఆర్ఎస్ఐ సాయి ప్రసన్నను స్థానికులు, వైద్య సిబ్బంది, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు అభినందించారు.

# జల సిరి గ్రామసభ విజయవంతం

- ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు
- రైతులకు ఫార్మ్ పాండ్లు
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా విస్తృత చర్చ

**కామారెడ్డి ప్రతినిధి జూలై 31 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల సిరి కార్యక్రమంలో భాగంగా క్యాసం పల్లి తండా గ్రామంలో శుక్రవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధి, జల వనరుల సంరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి, కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామసభలో నిర్ణయించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రైతులు తమ పొలాల్లో ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి సాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో మురుగునీటి పారుదల, తాగునీటి నిర్వహణ, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ, జల సిరి కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంచాయతీ సెక్రటరీ నాగరాణి మాట్లాడుతూ గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు



తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ గ్రామసభలో సర్పంచ్ భూక్య శ్రీనివాస్ ఉపసర్పంచ్ పంచాయతీ సెక్రటరీ నాగరాణి పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు సుకన్య వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది

# సుదర్శన్ రెడ్డి కన్నుమూత

● పెద్దికీ మెదక్‌తో విడదీయారని బంధం..

మెదక్...2014 మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ: ఇంచార్జిగా పెద్ది



**మెదక్ (ప్రజా జ్యోతి)** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికి క్రితం మరణించారు.ఆయన మృతి చెందడంపట్ల మాజీ మున్సిపల్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఆకీ రెడ్డి కృష్ణారెడ్డి,మామిళ్ళ ఆంజనేయులు సంతాపం వ్యక్తం చేశారు. 2014 లో జరిగిన మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఇంచార్జిగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వ్యవహరించారు. మెదక్ లో గతం లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జిగా ఉన్నారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,తో పాటు తెరాస కౌన్సిలర్లు గెలుపుకు...ఎంతో కృషి చేశారు.వుండి అందరి తో కలుపుగోలుగా ఉండి తెరాస అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేశారు.మీడియా తో వ్యక్తిగతంగా నాతో పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులుగా ఉన్నారు.ఆయన మరణం తెలంగాణ కు తీరని లోటు. ఉద్యమకారులకు పెద్దన్నగా వ్యవహరించారు.ఆయన మరణం తీవ్రంగా కలిచి



వేస్తుంది.పెద్దిని బతికించేందుకు యశోద ఆసుపత్రికి మాజీ సిఎం కేసీఆర్ స్వయంగా చేరుకొని డాక్టర్ లతో మాట్లాడారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటి క్రితం పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందారు.పెద్ది ని బతికించేందుకు మాజీ సీఎం కేసీఆర్ కేటీఆర్.. హరీష్ రావు లు చేసిన కృషి...మర్చిపోలేనిది.

# చిత్రకళ సమాజానికి దిక్సూచి

**సిద్దిపేట రూరల్, జులై 31, (ప్రజాజ్యోతి):** సమాజ అభివృద్ధిలో చిత్రకళ కీలక పాత్ర పోషిస్తుందని అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం అన్నారు.ఆగస్టు 1న వరల్డ్ పెయింటింగ్ డే సందర్భంగా సిద్దిపేట లోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ జీవన విధానాన్ని ప్రతిబింబించే చిత్రాల ప్రదర్శనను ఆయన





ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిమానవుడు ప్రకృతి విపత్తులకు భయపడి గుహల్లో నివసిస్తూ తన భావాలను గోడలపై చిత్రాల రూపంలో వ్యక్తపరచడం ద్వారా చిత్రకళకు నాంది పలికాడని వివరించారు. అప్పటి నుంచి నేటి వరకు చిత్రకళ అనేక రూపాల్లో అభివృద్ధి చెంది కాగితం, కాన్వాస్‌తో పాటు ప్రకృతిలోని అనేక వస్తువులపై తన ఉనికిని చాటుకుందన్నారు. ఆధునిక యుగంలో డ్రాయింగ్, డిజైన్, శిల్పకళ, పెయింటింగ్, ఆలయ నిర్మాణం, ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, వైద్యం, వ్యాపారం, సినిమా, ప్రెస్, చరిత్ర, ప్రపంచ సంస్కృతి వంటి అనేక రంగాల్లో చిత్రకళ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖా రుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, నేచర్ ఆర్టిస్ట్ రూబినా రుస్తుం, రహీమ్ ఎం.డి. తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పాత ఇండ్ల పక్కన నడవ రాదు

● 18 వ వార్డులో వర్షానికి కూలిపోయిన ఇండ్లను పరిశీలన

● బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

● 18 వ వార్డు కౌన్సిలర్ శ్రీ రామ్ సరస్వతి ● నరేందర్

**దుబ్బాక ప్రతినిధి , జూలై 31( ప్రజా జ్యోతి)** వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రొత్తంగా ఉండాలని , గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పాత ఇల్లు కూలిపోవడం జరుగుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో చుట్టు ప్రక్కన ఉన్నవాళ్లు ఎవరు కూడా అటు ప్రక్కన పోకూడదని 18వ వార్డ్ కౌన్సిలర్ శ్రీరామ్ సరస్వతి నరేందర్ అన్నారు. శుక్రవారం రోజున 18 వ వార్డులో కూలిపోయిన ఇండ్లను





మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాత ఇల్లు కూలిపోవడం వారు తెలిపారు. అంతేకాకుండా కూలిపోయిన ఇండ్ల ప్రాంతాల వైపు వార్డు ప్రజలు ఎవరు వెళ్ళవద్దని తెలిపారు. ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. అంతేకాకుండా ఎవరికైనా నష్టం జరిగితే వెంటనే దుబ్బాక తాహసిల్దార్ కార్యాలయానికి కూలిపోయిన ఇల్లు ఫోటో ఆధార్ కార్డ్ బ్యాంక్ అకౌంట్ తీసుకెళ్లి తాహసిల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతూరి అంజిరెడ్డి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అటెండర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సిద్దిపేటఅర్బన్,జూలై 31(ప్రజాజ్యోతి):-** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, ఎల్లుపల్లి సమీపం లోని కేజీబీవీ లో ఆఫీస్ అటెండర్ పోస్ట్ ఖాళీగా ఉందని మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు ఆగస్టు ఒకటో తేదీ నుండి మూడవ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి వరకు విద్యార్హత కలిగి ఉండి సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అన్నారు. నిర్ణీత తేదీలోపు ఎల్లుపల్లి గ్రామస్తులు ఎవరు దరఖాస్తు చేసుకోలేకపోతే దరఖాస్తు చేసుకున్న వారిని తీసుకుంటామని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాయన్‌పల్లి వంతెనకు త్వరలోనే మోక్షం.. రూ. 2.30 కోట్లతో

# ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు!



**మెదక్ (ప్రజాజ్యోతి)** మెదక్ మండలంలోని రాయన్‌పల్లి వంతెన పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవ చూపారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన దెబ్బతిని 7 గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ.. సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 2.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నిధుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు వర్షాకాలంలో ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు మా ప్రతినిధి అందిస్తారు...వర్షాకాలంలో ప్రజల భద్రతే ధ్యేయంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు వేగంగా అడుగులు వేస్తున్నారు. మెదక్ మండల పరిధిలోని రాయన్‌పల్లి వద్ద వంతెన గత ఏడాది కురిసిన తీవ్ర వర్షాలకు దెబ్బతిని రాకపోకలు స్తంభించిపోయాయి. ఏడు గ్రామాల ప్రజలతో పాటు నిత్యం పొలాలకు వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే రోహిత్ రావు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించారు. వంతెన నిర్మాణం కోసం రూ. 2.30 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. నిధుల విడుదల మంజూరు కోసం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నారు. ఇటీవల ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే, రాయన్‌పల్లి వంతెన పరిస్థితిని వివరించి అత్యవసర ప్రాధాన్యత కింద నిధులు కేటాయించాలని కోరారు.కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్‌కు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అవసరమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.అంతేకాకుండా, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు మరియు చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, వర్షాకాలంలో ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అధికారులకు పిలుపునిచ్చారు.

# మెదక్ పురపాలక సాధారణ సర్వసభ్య సమావేశం

● పట్టణాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ, కౌన్సిలర్ల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశం

**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ పురపాలక సంఘ సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ కార్యాలయంలోని నిన్న మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతి రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మరియు అధికారులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు...5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు బిసి హాస్టల్ మార్గంలో మొరం వేయించాలని, వీధి కుక్కలు మరియు దోమల





నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు.7వ వార్డు కౌన్సిలర్ శంసున్నిసా బేగం ప్రతిపాదిత స్థలంలో 1 హెచ్ పి మోటార్ బిగించాలని విజ్ఞప్తి చేశారు.2వ వార్డు కౌన్సిలర్ నర్సింలు మున్సిపల్ నీటి సరఫరా, నిర్వహణ పనులపై సిబ్బంది తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.8వ వార్డు కౌన్సిలర్ మాయ గంగమణి రామాలయం గుడి వద్ద స్పీడ్ బ్రేకర్లు, మహిళా కమ్యూనిటీ హాల్ అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు.26వ వార్డు కౌన్సిలర్ దీపక్ కుమార్ డిగ్రీ కాలేజీ ప్రాపర్టీ టాక్స్ ఎక్కువగా ఉన్నందున రీవిజన్ చేయాలని కోరారు.9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ మహమ్మద్ కల్వర్టు నిర్మాణాన్ని ఎజెండాలో చేర్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, 50 ఫిట్ల రోడ్డు గుంతలమయంగా మారడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించారు.22వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ డబుల్ వాటర్ కనెక్షన్ల స్థానంలో పాత నల్లా కనెక్షన్ల డిస్కనెక్షన్‌కు ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదని, ఆగస్టు 15 నాటికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రతిపాదించారు.27వ వార్డు కౌన్సిలర్ అస్తరగల్ల పల్లెరాణీ పటేల్ కుంట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి, కొత్తగా నిర్మించి బహిరంగ వేలం వేయాలని విజ్ఞప్తి చేశారు.13వ వార్డు కౌన్సిలర్ చెదల్ సంధ్య వడ్డెర కాలనీలో రోడ్లు, మురికి కాలువలను మెరుగుపరచాలని కోరగా, 11వ వార్డు కౌన్సిలర్ నస్రిన్ బేగం తడి-పొడి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ అనీస్ ఫాతిమా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, 29వ వార్డు కౌన్సిలర్ బట్టి ఉదయ శానిటేషన్ ట్రాక్టర్ రిపేర్ వల్ల చెత్త సేకరణ మందగించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.23వ వార్డు కౌన్సిలర్ శృతి వార్డులో పనులు ప్రారంభించే ముందు సమాచారం ఇవ్వాలని, 18వ వార్డు కౌన్సిలర్ శశాంక్ మోటార్ రిపేర్ పనులను వేగవంతం చేయాలని, 19వ వార్డు కౌన్సిలర్ గంట సంపత్ అవసరమైన చోట మొరం వేయించి, డబుల్ కనెక్షన్లు తొలగించాలని కోరారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై చైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతి రాజు స్పందిస్తూ... పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వాటిని నివారణ కేంద్రానికి తరలించి స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని చెప్పారు. 29వ వార్డు డ్రైనేజీ సమస్యతో పాటు, జూనియర్ మరియు పాలిటెక్నిక్ కాలేజీ వద్ద వర్షపు



నీటి నిల్వ సమస్యలను ఇప్పటికే పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. నీటి సరఫరా సమస్యలపై ఇంజనీరింగ్ విభాగాన్ని అప్రమత్తం చేశామని, సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో నిధులు తీసుకువచ్చి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. డబుల్ వాటర్ ట్యాప్ కనెక్షన్లలో ఒకదానిని తొలగించేందుకు సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మెదక్ జిల్లా మైనారిటీ మోర్చాను ప్రకటించిన బీజేపీ

**మెదక్ (ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుని ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలో గల బిజెపి జిల్లా ఆఫీసులో బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చాను ఘనంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వాల్దీస్ రాధా మల్లేశం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జ్ఞాన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ మోర్చాను ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శులు నీరుడు లాజర్, సయ్యద్ గౌస్ పాషా జిల్లా



ఉపాధ్యక్షులు కమర్ సింగ్, షేక్ మహమ్మద్, ఎం.డి. ఖలీల్‌జిల్లా కార్యదర్శులు ఎం.డి. నవాబుద్దీన్, అజయ్ సింగ్, కోశాధికారి పర్వేజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సర్వర్ సింగ్, అమర్ సింగ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్లా రంజిత్ రెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వడ్ల జనార్దన్ పాపన్నపేట మండల అధ్యక్షుడు సంతోష్ చారి జిల్లా నాయకులు లోకేష్, మధురాజు, శ్రీనివాస్, మనోజ్, లింగరాజు తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# మెదక్ జిల్లాలో వర్షభీభత్సం రాయినపల్లి చెరువు కట్టకు గండి పడే ప్రమాదం!

● కట్టపై తీవ్ర నీటి ఒత్తిడి ● భయాందోళనలో గ్రామస్తులు





**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లాలో వర్షభీభత్సం కలకలం రేపుతోంది! ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండల పరిధిలోని రాయినపల్లి గ్రామం చెరువు నిండుకుండలా మారింది. చెరువులోకి నీటి ఉధృతి తీవ్రంగా పెరగడంతో.. నీటి ఒత్తిడికి చెరువు కట్ట



క్రమంగా బలహీనపడుతోంది. ఏ క్షణంలోనైనా కట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడటంతో స్థానిక ప్రజలు భయాందోళనలతో వణికిపోతున్నారు!గత కొంతకాలంగా ఈ చెరువు కట్టకు సరైన మరమ్మతులు చేయకపోవడం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ ముమ్మాటికీ లోపించడమే నేటి ఈ దయనీయ పరిస్థితికి కారణమని రాయినపల్లి స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు వేలాది మంది ప్రాణాల మీదకు తెచ్చిపెట్టిందని ఆవేదన చెందుతున్నారు. ఒకవేళ ఈ చెరువు కట్ట గనుక తెగిపోతే.. దిగువన ఉన్న దాదాపు ఏడు గ్రామాలకు తీవ్ర నీటి ముంపు ఎదురుకానుంది. ఇళ్ళు, పంట పొలాలు పూర్తిగా నీట మునిగి తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి గండిపడకుండా యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని, తగిన ఇసుక బస్తాలు, యంత్రాలతో కట్టను బలపరచాలని దిగువ గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. ఇట్టి ప్రాంతాన్ని టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గారు పద్మాదేవేందర్ రెడ్డి గారు సందర్శించడం జరిగింది



## ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతంగ పూర్తి చేయాలి





కొడంగల్ జులై 31 ప్రజా జ్యోతి : శ్రీ మహాలక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస రాజు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్‌లో నిర్మిస్తున్న శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తో కలిసి సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరిశీలించారు. అనంతరం కడ కార్యాలయంలో ఇంజనీరింగ్, కన్సల్టెన్సీ ఏజెన్సీ, ప్లానింగ్ డిజైనర్స్, కాంట్రాక్టర్‌లతో ఆలయ పనుల నిర్మాణాలపై సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ సమీక్షించారు. సందర్భంగా సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ... ఫిబ్రవరి మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు గాను దేవాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. దేవాలయానికి సంబంధించి భూ సేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, దేవాలయ సీఈఓ ఆర్ అండ్ బి ఎస్ఇ వసంత నాయక్, డిఇ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని పర్యవేక్షించిన కలెక్టర్





కొడంగల్ జులై 31 ప్రజా జ్యోతి : మానవ వనరులు, మిషనరీ సామర్థ్యాన్ని పెంచుకొని ఎడ్యుకేషన్ హబ్ లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో దుద్యాల మండలం హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ కు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా లు ఆకస్మికంగా పర్యటించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు...

## మోండా డివిజన్‌లో ఇందిరమ్మ కాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్





బోయిన్ పల్లి, జులై 31 (ప్రజా జ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివిజన్‌లో సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలోని కొండల్‌రెడ్డి స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కాంటీన్ను స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం ప్రారంభించారు...

## వన్ వార్డ్ ఎవరీ డే హైటెక్ సిటీ వార్డులో పౌర సమస్యలను సమీక్షించిన కమిషనర్





శేరిలింగంపల్లి, జులై 31 (ప్రజాజ్యోతి): సైబరాబాద్ వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్...

## ఆషాఢ మాస బోనాల సందడి.. ఆగస్టు 2న మైసమ్మ, 3న పోచమ్మ తల్లి బోనాలు

**- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు - ఉత్సవాల్లో భారీగా పాల్గొనాలి: చైర్పర్సన్ రజిత వెంకటేష్**



పరిగి, జులై 31 (ప్రజాజ్యోతి) : పరిగి పట్టణంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది ఆగస్టు 2, 3 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు పరిగి మున్సిపల్ చైర్పర్సన్ కుదుముల రజిత వెంకటేష్ తెలిపారు...

## జర్నలిస్టుల హక్కుల సాధనకై కృషి చేస్తాం..





**- పరిగి నియోజక వర్గ అడహక్ కమిటీ కన్వీనర్ వి. శ్రీనివాస రావు. - టియు డబ్ల్యుజే - హెచ్ 143 పరిగి నియోజక వర్గ అడహక్ కమిటీ నియామకం**

పరిగి, జులై 31 (ప్రజాజ్యోతి) : టియు డబ్ల్యుజే - హెచ్ 143 (తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ - ఎచ్ 143) పరిగి నియోజకవర్గం అడహక్ కమిటీ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ వి శ్రీనివాస్ రావు నియమితులయ్యారు...

## ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు తప్పనిసరి





- సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్
- అలాగే గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు

కొత్తూర్ జులై 31 (ప్రజా జ్యోతి) : ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మించుకుని, వాన నీటిని సంరక్షించుకోవాలని సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్ అన్నారు...

## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు పలికిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సిపి డాక్టర్ ఎం రమేష్ ఐపీఎస్





శేరిలింగంపల్లి, జులై 31 (ప్రజాజ్యోతి) : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో, 2026 జులై 31వ తేదీన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన ఏడుగురు (07) పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించబడింది...

## హయత్‌నగర్‌లో ఘనంగా ప్రారంభమైన స్వస్తిక్ డిజిటల్ కలర్ ల్యాబ్ & స్టూడియో



హయత్‌నగర్ జులై 31 (ప్రజాజ్యోతి) : హయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారి బెస్ట్ కాంప్లెక్స్ లో శుక్రవారం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన స్వస్తిక్ డిజిటల్ కలర్ ల్యాబ్ & స్టూడియోను...

## నకిలీ ఎరువుల విక్రయాలు అధికారుల వైఫల్యానికి నిదర్శనం

- రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కన్వీనర్ బుడగ జంగం వెంకటేష్



తాండూరు జులై 31(ప్రజా జ్యోతి) : నకిలీ ఎరువులు, విత్తనాలు మార్కెట్లో విక్రయించడం ఇది ముమ్మాటికీ అధికారుల వైఫల్యానికి నిదర్శనమని అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కన్వీనర్ బుడిగ జంగం వెంకటేష్ విమర్శించారు...

## పోతరాజు విజయ్ కుమార్‌ను సన్మానించిన రాజా సింగ్



హైదరాబాద్, జులై 31 (ప్రజా జ్యోతి) : గత 33 ఏళ్లుగా బోనాల సందర్భంగా పోతరాజుగా సేవలందిస్తున్న సోమ విజయ్ కుమార్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే టి.రాజా సింగ్...

## ఐదు రోజుల్లో చోరీ కేసు ఛేదన 100 గ్రాముల బంగారం రికవరీ



శేరిలింగంపల్లి జులై 31 (ప్రజాజ్యోతి) : మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో నివాసం ఉంటున్న వద్ద తార ఇంట్లో చోరీకి గురైన 100 గ్రాముల బంగారాన్ని ఆభరణాల కేసును పోలీసులు 5 రోజుల్లో ఛేదించారు...

## నాణ్యమైన విద్యను విస్తరించడమే వర్తన లక్ష్యం



హైదరాబాద్, జులై 31 (ప్రజా జ్యోతి) : దేశ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలకు తోడ్పాటు అందిస్తూ నాణ్యమైన విద్యను విస్తరించడమే వర్తన సంస్థ లక్ష్యమని...

# దేవతలకుంటకు గండి.. జేసీబీతో తాత్కాలిక మరమ్మతులు

కొడిమ్యాల, జూలై 31 (ప్రజాజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామంలోని దేవతల కుంట కట్ట శుక్రవారం కోతకు గురైంది. కుంట నిండిపోవడంతో నీటి ఉధృతి పెరిగి కట్టకు గండి పడింది. దీంతో వరద నీరు సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి ప్రవహించి పలు ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నీటమునిగింది. స్థానిక సర్పంచ్ అక్కేనపల్లి గంగవ్వ





సమాచారం మేరకు అధికారులు,స్థానిక యంత్రాంగంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెంటనే జేసీబీ సాయంతో గండి పడిన ప్రాంతాన్ని మట్టితో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో నీటి ప్రవాహం అదుపులోకి వచ్చింది. మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కట్టను శాశ్వతంగా బలోపేతం చేయాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఇరిగేషన్ ఏఈ రాజేష్ కన్నా, డీఈ కె. రమేష్, ఎంపీడీఓ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి కథనానికి స్పందన..

## పాఠశాలలో నిల్వ నీటి తొలగింపుకు చర్యలు

కొడిమ్యాల,జూలై 31,(ప్రజాజ్యోతి): మండలం పూడూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వర్షపు




ప్రజాజ్యోతి

జలమయమైన పూడూరు ప్రభుత్వ పాఠశాల

నీటితో జలమయమైన నేపథ్యంలో 'జలమయ మైన పూడూర్ ప్రభుత్వ పాఠశాల' శీర్షికతో గురువారం "ప్రజాజ్యోతి" దినపత్రికలో ప్రచురిత మైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఎంపీడీఓ స్వరూప, ఎంఈఓ శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిని జేసీబీ సహాయంతో తొలగించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాజ్యోతి దినపత్రికకు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ రహదారి 563పై ప్రమాద ఘంటికలు..!


## భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు పక్కభాగం

## వాహనదారుల్లో ఆందోళన

## మరమ్మతులు చేపట్టాలని వాహనదారుల డిమాండ్

కొడిమ్యాల, జూలై 31,(ప్రజాజ్యోతి): జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–563)పై కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో రహదారి ప్రక్కన కల్వర్టు ఒకవైపు కుంగిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైనేజీ కాలువపై నిర్మించిన కల్వర్టు





పక్కభాగం దెబ్బతిని గుంత ఏర్పడడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాద హెచ్చరికగా స్థానికులు ఎర్రజెండా ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో డ్రైనేజీ కాలువ ఉప్పొంగి రోడ్డుపైకి నీరు చేరుతోంది. కాలువలో చెత్తాచెదారం, పైప్‌లైన్లు అడ్డంకిగా మారడంతో నీటి ప్రవాహం సక్రమంగా సాగక రహదారి అడుగుభాగం కోతకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీని శుభ్రపరచడంతో పాటు దెబ్బతిన్న రహదారికి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# చర్లపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

ఎండపల్లి, జూలై 31, ప్రజా జ్యోతి: మండలంలోని చర్లపల్లి లో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి అధ్యక్షతన



నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని వాటిని ప్రతి ఒక్కరూ తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని అదే విధంగా రాజ్యాంగం నిర్దేశించిన విధులను కూడా బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు,కులమతాలకు అతీతంగా అందరం సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి,ఆర్ ఐ అన్వేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, ఎండపల్లి సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారి మహమ్మద్ అప్సర్, జిపిఓ సంజయ్, సిఆర్పి రాజా రాణి, వివిధ శాఖల అధికారులు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు,యువత గ్రామస్తులు పాల్గొన్నారు,

# ఆగని కరెంటు కోతలు.. వినియోగదారులకు తప్పని తిప్పలు,?

ఎండపల్లి, జూలై 31, ప్రజా జ్యోతి : ఇటీవల కురుస్తున్న వర్షాలతో విద్యుత్ అంతరాయాలు పెరగగా, మరోవైపు ప్రతి వారం మరమ్మతుల పేరుతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంపై , వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అలాగే మరమ్మతుల పేరుతో వారానికోసారి గంటల కొద్దీ వేచి ఉండాల్సి రావడం వినియోగదారులకు నిత్యకృత్యంగా మారిందని వాపోతున్నారు.గృహ వినియోగదారులు తాగునీటి సమస్యలు, రోజువారీ పనులకు అంతరాయం, చిన్న వ్యాపారులు ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రతి వారం నిర్వహణ పనులు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, కరెంటు కోతలు మాత్రం తగ్గడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు, శుక్రవారం రోజున మండలంలోని రాజారాంపల్లికి ,వివిధ పనుల నిమిత్తం వినియోగదారులు చిరు వ్యాపారాలు వస్తూ ఉంటారు ఈ సమయంలో ముందస్తు సమాచారం



లేకుండా విద్యుత్ అధికారులు ఉదయం 11 గంటలకు నుండి సాయంత్రం 4 గంటల వరకు సుమారు 6 గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేసి, వివిధ పనుల పేరిట మరమ్మతులు చేస్తున్నామని విద్యుత్ అధికారులు చెబుతున్నప్పటికీ వినియోగదారులకు మాత్రం విద్యుత్ అంతరాయాలు పునరావృతమవుతునే ఉన్నాయని విద్యుత్ అధికారులపై వినియోగదారులు వాపోతున్నారు. వర్షాకాలానికి ముందే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని. తరచూ మరమ్మతుల పేరుతో విద్యుత్ నిలిపివేయడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, ముందస్తు ప్రణాళికతో నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని వినియోగదారులు కోరుతున్నారు,

# చెరువు కట్ట, తూమును పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

## శాశ్వత రక్షణ చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

వెల్గటూర్, జూలై 31 (ప్రజా జ్యోతి): సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువుకు అధిక వరద ప్రవాహం చేరిన నేపథ్యంలో గతంలో ఏర్పడిన



సింక్‌హోల్ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జూలై 29న 175.7 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదవడంతో చెరువులోకి భారీగా వరద నీరు చేరిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సాండ్‌బ్యాగ్స్ దెబ్బతిని చెరువు కట్టకు నష్టం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జూలై 30 సాయంత్రం నుంచి వర్షాలు తగ్గడంతో పాటు జూలై 31 నాటికి వరద ప్రవాహం పూర్తిగా తగ్గిందని, అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో సాండ్‌బ్యాగ్స్ యథాతథంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం చెరువు కట్ట, తూముకు ఎలాంటి ముప్పు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత రక్షణ చర్యలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరి వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో , డీఈఈ, ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాములపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

## మహిళల ఆరోగ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన

## ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ

ఇల్లందకుంట, జూలై 31 (ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఉచిత వైద్య శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని శ్రీరాములపల్లి గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య రవికుమార్ అన్నారు. ఆసుపత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో హనుమకొండ లక్ష్మీనరసింహ లూమినస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రోజూ తగిన మోతాదులో మంచినీరు తాగాలని, నీరు తక్కువగా తీసుకోవడం వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సూచించారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ తేజస్విని మహిళలు ఇంటి పనులకు మాత్రమే పరిమితం కాకుండా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భసంచికి సంబంధించిన సమస్యలు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కారోబార్ తిప్పారపు వీరన్న మాట్లాడుతూ గ్రామ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలపై వైద్యులు సమగ్రంగా అవగాహన కల్పించి, అవసరమైన వారికి షుగర్, రక్తపోటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, ఆసియా, లూమినస్ హాస్పిటల్ వైద్యులు సంకీర్తన, పీఆర్వో బిక్షపతి, సంపత్ రెడ్డి, రాజేష్,



సిబ్బంది ప్రసన్న, భారతి, కృష్ణవేణి, గ్రామ ఉపసర్పంచ్ ఇంగ్లే లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి సుమలత, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి గొడుగు మానసతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్

## అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

## సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తింపు: వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు

కొనరావుపేట, జూలై.31(ప్రజాజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు ఈరోజు ఉదయం వేములవాడ డీఎస్పీ ఆధ్వర్యంలో





కొనరవుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి మరియు కమ్మరి పేట తండాలల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 39 ద్విచక్ర వాహనాలను గుర్తించి,సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను (సస్పెక్ట్స్) తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనిలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో. చందుర్తి సర్కిల్ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, రమేష్, మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక వరి వద్దు ఆరుతడి పంటలే ముద్దు జి ప్రవీణ్ వ్యవసాయాధికారి

ఇల్లంతకుంట జూలై 31(ప్రజజ్యోతి) అధిక వారి వద్దు ఆరుతడి పంటలే ముద్దు అని రాజన్న సిరిసిల్ల జిల్లా



ఇల్లంతకుంట మండలంలోని రైతు సోదరులకు మండల వ్యవసాయాధికారి . జి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు శుక్రవారం రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ మాట్లాడుతూ నిన్న మొన్న కురిసిన తేలికపాటి వర్షానికి రైతు సోదరులు వరి నాట్లు వేసే దిశక వెళ్తున్నారు వున్నా తేలికపాటి వర్షపు నీటికి వరి వేసినట్లు ఐతే చివరి దశలో నీరు అందక అధికంగా నష్టపోవలసి వస్తుందనీ చివరి దశలో అనగా (వరి గింజ పాలుపోసుకొని గింజ గట్టి పడే సమయం) నీరు ఇవ్వకుంటే పంటకాలం మొత్తం పెట్టిన పెట్టుబడి నష్టపోవలసి వస్తుందనీ కావున పడిన తేలికపాటి వర్షాన్ని ఒడిసి పట్టుకొని భూములోనే ఇంకే విదంగా పొలంలో ఫార్మ్ పాండ్ గాని బోర్ వెల్ రీఛార్జ్ పిట్ కానీ తవ్వుకొని పడిన కొద్దీ వర్షపు నీటిని భూమిలోనే ఇంకించుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయనీ ఇప్పుడు పడిన వర్షానికి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు కంది, పెసర, మినిము, జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు వంటి పంటలు 3 ఎకరాల వరకు పండించవచ్చునని ఎవరైనా రైతు సోదరలకు కంది విత్తనాలు అవసరం ఉన్నచో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో 25% సబ్సిడీతో అందుబాటులో వున్నాయని రైతులు అవకాశాన్ని వినియెగించుకోగలరనీ కోరారు

# భారీ వర్షాలకు ఐదు ఇల్లు కూలివేత

కొడిమ్యాల, జూలై 31,(ప్రజాజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు చెప్యాల,నమిలికొండ,సూరంపేట గ్రామాల్లో





శుక్రవారం నాలుగు నివాస గృహాలు కూలిపోయినట్లు ఆర్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ,మండల కేంద్రానికి చెందిన సుంకెపాక లక్ష్మీ,చెటపల్లి లక్ష్మి , చెప్యాల గ్రామానికి చెందిన పిల్లలమర్రి శ్రీనివాస్, నమిలికొండ గ్రామానికి చెందిన గుంటి ఐలవ్వ భర్త పర్వతాలు,సూరంపేట గ్రామానికి చెందిన చెప్యాల లక్ష్మి నివాస గృహాలు వర్షాలకు పాక్షికంగా దెబ్బతిని కూలిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది.అనంతరం నష్ట వివరాలను తహసీల్దార్ కు పంపించినట్లు ఆర్ఐ తెలిపారు. పరిశీలనలో కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, గ్రామ పాలన అధికారి సాజిద్ పాల్గొన్నారు.

# రోళ్లవాగు నీటిని వృథా పోనివ్వొద్దు: కొలుముల రమణ డిమాండ్

బీర్‌పూర్, జూలై 31 (ప్రజా జ్యోతి): జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని అతిపెద్ద ప్రాజెక్టయిన రోళ్లవాగు నీటిని నిల్వ చేసి, రైతుల కష్టాలను తీర్చాలని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వరాలకు రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆ ఆనందం రైతులకు ఎంతోసేపు నిలవలేకపోయిందని మాజీ జెడ్పీటీసీ కొలుముల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు



తూములకు సరైన షట్టర్లు (తలుపులు) బిగించకపోవడం వల్లే వచ్చిన నీరంతా వృథాగా బయటకు పోతోందని, వర్షాకాలం కంటే ముందే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని మండిపడ్డారు. మూడు మండలాలకు వరప్రదాయిని అయిన ఈ ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తే సారంగాపూర్, బీర్ పూర్, ధర్మపురి మండలాల పరిధిలో తాగు, సాగునీటి తిప్పలు తప్పుతాయని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి తూములకు తలుపులు బిగించి నీటిని నిల్వ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుమన్, మాజీ జెడ్పీటీసీలు గుడిసె జితేందర్ యాదవ్, ముక్క శంకర్ యాదవ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణరావు, చెరుపూరి సుభాష్ యాదవ్, ఆడెపు తిరుపతి మరియు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

## మెడికవర్ హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం

ధర్మారం,జూలై 31(ప్రజా జ్యోతి న్యూస్): ధర్మారం మండలంలోని ఖమ్మరి ఖాన్‌పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్




ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది.శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా రక్తపోటు (బీపీ),మధుమేహం (షుగర్),గుండె సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.వైద్య నిపుణులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు.ఈ శిబిరానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని నిపుణుల సలహాలు పొందారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇరుగురాల మహేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మెడికోవర్ ఆసుపత్రి కరీంనగర్ వైద్య బృందానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నపాలెం గ్రామంలో 100% సర్ కార్యక్రమం విజయవంతం



ముదిగొండ జూలై 31(ప్రజా జ్యోతి ) మల్లన్నపాలెం గ్రామం బూత్ నెంబర్ 33లో బి ఎల్ ఏ యలగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 100% పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఓ మాజీ సర్పంచ్ చిలకల రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ నాగ హుస్సేన్ ఖాన్ ,ఉపాధ్యక్షులు ఏనబోయిన ముత్తయ్య, ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు చిలకల ఉపేందర్,బి ఎల్ ఓ అధికారి ఓ పంచాయతీ కార్యదర్శి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పూర్తి అయ్యేవరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపూడి బుచ్చి రామయ్య, నియోజకవర్గం సర్ ఇంచార్జ్ మల్లెల అజయ్,మండల ఇంచార్జ్ భూక్యా ధర్మానాయక్ , క్లస్టర్ ఇంచార్జ్ పాదిల గోపి చంద్ వీరందరూ గ్రామ స్థానిక బి ఎల్ ఓ ఓ బి ఎల్ ఏ మరియు స్థానిక నాయకులను మానిటరింగ్ చేస్తూ విజయవంతం చేయడం జరిగింది.

## అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం

- బీఆర్ఎస్ నాయకులు పోలిశెట్టి సత్తిబాబు



పినపాక, జూలై 31(ప్రజాజ్యోతి): పినపాక మండలంలోని ఏల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గోతం మనోజ్ బాబాయి గోతం శ్రీను అనారోగ్య కారణాలతో మృతి చెందారు. అలాగే జగ్గారం గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురం



గ్రామానికి చెందిన గుంటుపల్లి బాబూరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్తిబాబు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దహన సంస్కారాల నిమిత్తం తన వంతు సహాయంగా గోతం శ్రీను కుటుంబ సభ్యులకు రూ.3,000 నగదును, 2000 రూపాయలు బాబూరావు కుటుంబ సభ్యులకు స్థానిక ఉప సర్పంచ్ అశోక్ చేతులమీదుగా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు.

## గోదావరి వరద పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



పినపాక,జూలై 31(ప్రజాజ్యోతి) పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోదావరి వరద పరివాహక ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి,ఎంపీడీవో సంకీర్త్,ఎస్ఐ సురేష్ పరిశీలించారు. గోదావరి నీటి మట్టం, వరద పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని, స్వయంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ ప్రజలు గోదావరి ఒడ్డుకు వెళ్లకుండా, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, జి పి ఓ లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు

## శ్రావణ మాసం వేడుకలకు ముస్తాబవుతున్న ముత్యాలమ్మ ఆలయ పరిసరాలు



టేకులపల్లి,జూలై 31,(ప్రజాజ్యోతి): రానున్న శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని టేకులపల్లి మండలంలోని బోడ బజార్ శ్రీ ముత్యాలమ్మ ఆలయం, పోస్ట్ ఆఫీస్ సెంటర్, బోడు రోడ్డు పరిసరాల్లో సర్పంచ్ బోడ బాలు ఆధ్వర్యంలో మొరం తోలకం పనులు చేపట్టారు. శ్రావణ మాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుడిపూడి సత్యనారాయణ, ఇస్లావత్ మంగ నాయక్, అయితా శ్రీరాములు, నోముల భాస్కర్, తోటకూరి రామారావు తదితరులు పాల్గొని శ్రమదానం చేసి పనులను విజయవంతంగా నిర్వహించారు.

# నీటి పారుదల అభివృద్ధి పనులు శర వేగంగా పూర్తి చేయాలి

- ఇరిగేషన్ డీఈఈ పొట్టయ్య





నేలకొండపల్లి, జూలై 31 (ప్రజా జ్యోతి): నీటిపారుదల అభివృద్ధి నేలకొండపల్లి సబ్ డివిజన్ లో పనులను శర వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ డివిజన్ డీఈఈ జె.పొట్టయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయం లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... చెరువుమాధారంలో రూ40 లక్షలుతో తూముల వద్ద, ఆచార్లగూడెం లో కెనాల్ కల్వర్టు కు రూ.3.8 లక్షలు, ఆరెగూడెం కెనాల్ కు రూ.6.48 లక్షలు, బుద్దారం తూముల మరమ్మతుల కు నిధులు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ లో కొత్తగా చెరువుమాధారం 1.2 ఎత్తిపోతల పథకం కు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మొదటి పథకం కు రూ.3.82 లక్షలు, రెండో పథకం కు 3.33 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ లష్కర్స్, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....కాలువ కట్టలపై చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా పడితే...నీరు వచ్చే అవకాశం ఉందన్నారు..అందుకు ముందే కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంగాపురంతండా మేజర్ కాలువ కట్ట పై-ప్రతీ ఒక్కరూ సిబ్బంది షెడ్యూల్ ప్రకారం కంప చెట్లు తొలగించే పనులు చేపట్టాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ లు నరేష్, ఋత్విక్, సిబ్బంది పాల్గొన్నారు.

# జీతాలు చెల్లించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

- ఎంపీడీవో కార్యాలయం ముందు ఈజీఎస్ ఉద్యోగులు



సత్తుపల్లి జూలై31(ప్రజా జ్యోతి) గత మూడు నెలల నుండి జీతాలు చెల్లించక పోవటంతో ఉపాధి హామీ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఉద్యోగులు, టెక్నికల్ అసిస్టెంట్లు నల్ల బ్యాడ్జీలతో ఎంపీడీవో కార్యాలయం ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీవో బాబూరావు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి తారీఖున జీతాలు పడే విధంగా ఉండాలని, పే స్కేలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగికి ఎన్ని సౌకర్యాలు ఉన్నాయో మాకు వర్తించేలా ఉండాలని, సంవత్సరాల తరబడి ట్రాన్స్ఫర్ లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ప్రమోషన్స్ లేవని, ఇంక్రిమెంట్లు లేవని, మాకు ట్రాన్స్ఫర్ కూడా అమలు చేయాలని ఎంపీడీవో కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జీతాలు సక్రమంగా రాకపోవడంతో పిల్లలను సక్రమంగా చదివించుకోలేక, ఇబ్బందులు పడుతున్నామని, గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులను కలిసి విన్నవించామని ఎవరు పట్టించుకోవటం లేదని, ఇలా పట్టించుకోకుండా ఉంటే ఆగస్టు 16 నుండి సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిసి నాగ శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్లు విజయమ్మ, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, కంప్యూటర్ అసిస్టెంట్ రాంబాబు, సత్యనారాయణ లు ఉన్నారు.

## ఆగస్టు 3 లోపు ప్రతి ఓటరు గణన ఫారాన్ని

# సమర్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి గణన ఫారాలు సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులకు సహకరించాలిప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు గణన ఫారాన్ని ఆగస్టు 3 లోపు తప్పనిసరిగా సమర్పించేలా రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగు తోందన్నారు. 31,967 మంది మృతి చెందిన ఓటర్లు, 10,060 డబుల్ ఎంట్రీలు, 94 వేల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఇంకా సుమారు 31 వేల మంది ఓటర్లు గణన ప్రక్రియకు స్పందించడం లేదని, వీరిలో అధిక సంఖ్యలో ఖమ్మం నగరానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు.గణన ఫారాలు పూరించి ఇవ్వని పక్షంలో సంబంధిత ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే అనంతరం అవసరమైన ధృవపత్రాలతో ఫారం-6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమాచారం, ఎన్నికల నమోదు అధికారులు రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారని, రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలు, మద్దతుదారులను చైతన్యపరిచి గడువులోగా గణన ఫారాలు సమర్పించేలా చూడాలని కోరారు.శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు ఆయా ప్రాంతాల్లో ఓటుగా నమోదు అయ్యారా లేదా అనే విషయాన్ని కూడా రాజకీయ పార్టీలు తమ స్థాయిలో నిర్ధారించాలని సూచించారు. జిల్లాలో అందిన సుమారు 10 లక్షల గణన ఫారాల్లో 42 వేల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాలేదని, వారికి భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించేందుకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ధృవీకరణ పత్రం అవసరమైన వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని మొత్తం 1,460 పోలింగ్ కేంద్రాల్లో 677 కేంద్రాల్లో 100 శాతం గణన ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, మరో 544 కేంద్రాల్లో 95 శాతం, 158 కేంద్రాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సహకరించి ప్రతి ఓటరు సరైన వివరాలతో గణన ఫారం సమర్పించేలా చూడాలని సూచించారు. ఆగస్టు 3 గణన ఫారాల సమర్పణకు చివరి తేదీ అని, ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి, అక్టోబర్ 12, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్ఓ సి.హెచ్. రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి డి. సౌజన్య, బీఆర్ఎస్ ప్రతినిధులు రమేష్, వేణుగోపాల్, వెంకటరావు,బీజేపీ ప్రతినిధి రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి రామయ్య, ఆప్ ప్రతినిధి సుబ్బారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

- ముదిగొండ గ్రామ సర్పంచ్ కట్టకూరు ఉపేందర్



ముదిగొండ జూలై 31(ప్రజా జ్యోతి) ముదిగొండ మండల కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్ లను పంపిణీ చేసిన సర్పంచ్ కట్టకూరి ఉపేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్ చేకూరి పార్వతి, వసతిగృహం వార్డెన్ శ్రీలక్ష్మి, తునికిపాటి రూప, మెట్టెల సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోనే ఎస్ఐఆర్ ప్రోగ్రాంలో సత్తుపల్లి ప్రథమం: మధు



సత్తుపల్లి జూలై31(ప్రజా జ్యోతి) ఖమ్మం జిల్లాలోని సర్ ప్రోగ్రాం తమ ఓటు హక్కు కాపాడుకునేందుకు,డబుల్ ఓటు లేకుండా ఉండేందుకు సర్ ప్రోగ్రాం ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. గత జూన్ నెలలో ప్రారంభమైన సర్ ప్రోగ్రాం ఏ.ఎల్.ఎం.టి మధు ఖమ్మం జిల్లాలోనే సత్తుపల్లిని నెంబర్ వన్ స్థానంలో ఎంతో కష్టపడి ప్రథమ స్థానాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 76 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 65,488 ఓటర్లలో7,500 ఓట్లు సేకరణకు వీలుగాని గా ఉన్నాయి. మిగిలిన ఓటర్లందరినీ 100% డిజిటలైజేషన్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కింది. బి ఎల్ ఓ లు ,వాలంటీర్లు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు,వివిధ రాజకీయాల పార్టీల సహాయ సహకారాలతో జిల్లాలోని నిలవటం గర్వంగా ఉందని అన్నారు. ఈ విధంగా జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలపడం వలన తాసిల్దార్ పుల్లం సత్యనారాయణ వారికి అభినందనలు తెలియజేశారు.

## చందా కాంతారావుకు ఘన సన్మానం

- పదవీ విరమణ సందర్భంగా సేవలను కొనియాడిన అధికారులు



పినపాక,జూలై 31(ప్రజాజ్యోతి) చందా కాంతారావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం పినపాక మండలం జివిఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు హాజరై ఆయన ప్రభుత్వ సేవలను ప్రశంసించారు. మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు మాట్లాడుతూ, చందా కాంతారావు ఉద్యోగ జీవితమంతా అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రభుత్వ సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ కొమరం లక్ష్మణరావు శాలువాతో చందా కాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సహచరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# చదువులో ముందంజ.. సదుపాయాల్లో వెనుకంజ!

- ఇద్దరు ఉపాధ్యాయుల కృషితో ఆదర్శంగా నిలిచిన పాఠశాల
- ఆటస్థలం లేక.. నీటి నిల్వల మధ్యనే చిన్నారుల విద్యాభ్యాసం
- ప్రహరీ గోడ, మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి






అన్నపురెడ్డిపల్లి, జూలై 31 (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంకటాపురం పీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యా బోధనలో ఆదర్శంగా నిలుస్తున్నప్పటికీ, మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు కొనసాగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనంగా నిలుస్తోంది.అయితే పాఠశాలలో రెండు తరగతి గదులు మాత్రమే ఉండగా, విద్యార్థులు



ఆడుకోవడానికి కనీస ఆటస్థలం కూడా లేదు. పాఠశాల గ్రామంలోని నీటి ట్యాంకు సమీపంలో దిగువ ప్రాంతంలో ఉండటంతో ట్యాంకు నిండిన ప్రతిసారి నీరు పాఠశాల ఆవరణలోకి చేరి నిల్వ ఉంటుంది. దీంతో ప్రాంగణమంతా గడ్డి పెరిగి విద్యార్థులు బయటకు రావడానికి, ఆటలు ఆడడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరుకోగా, కొత్త మరుగుదొడ్డి నిర్మాణానికి అనుమతి లభించినప్పటికీ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రాంగణంలో నిలిచే నీటి సమస్యపై ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రాంగణంలోని నీటి నిల్వను వెంటనే తొలగించడం, ఆటస్థలం ఏర్పాటు చేయడం, ప్రహరీ గోడ నిర్మించడం, అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ఈ పాఠశాలకు అవసరమైన వసతులు కల్పిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# 42 ఏళ్ల సేవకు ఘన నివాళి

## విధులకు వీడ్కోలు పలికిన సయ్యద్ అమీర్ అలీ

ఖమ్మం(ప్రజాజ్యోతి): ప్రజాసేవనే పరమావధిగా భావించి 42 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, ధైర్యసాహసాలతో సేవలందించిన సయ్యద్ అమీర్ అలీ అధికారికంగా పదవీ విరమణ పొందారు. సేవా కాలమంతా ప్రజల





భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన ఆయన తన విధులను అంకితభావంతో నిర్వహించి సహచరుల ప్రశంసలు, ప్రజల అభిమానాన్ని పొందారు. క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన ఆయన పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు సేవా పతకాలు, ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులు అందుకుని తన సేవలను మరింత గౌరవప్రదంగా నిలిపారు. ఈ సందర్భంగా సహచర అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు సయ్యద్ అమీర్ అలీకి ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఆయన సేవలను కొనియాడారు. "ఒక యూనిఫాం ఈ రోజు విశ్రాంతి తీసుకుంటోంది... కానీ ఆ యూనిఫాంలో నిలిచిన నిజాయితీ, ధైర్యం, కర్తవ్యనిష్ఠ, ప్రజాసేవ చరిత్రగా చిరకాలం నిలిచిపోతాయి. 42 ఏళ్ల అంకిత జీవితానికి హృదయపూర్వక సెల్యూట్" అంటూ పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలు కలగాలని అందరూ కోరుకున్నారు.

# కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారు

మొదటిపేజీ తరువాయి..

తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని.. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.

## ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ప్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.

# గోదావరి వరద ఉధృతి

**ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి**

**ఖమ్మం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు**

హైదరాబాద్,జూలై31(ప్రజాజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం సాయంత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రాజెక్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చినందున మూడవ ప్రమాదహెచ్చరిక జారీ చేశామని, ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చారు.

## బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే

# పెద్ది కన్నుమూత

మొదటిపేజీ తరువాయి..

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది. అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన



రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. పెద్ది దర్శన్ రెడ్డి పార్థివదేహాన్ని చూసిన పలువురు అభిమానులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాయకుడు ఇక లేరు' అంటూ విలపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడికి తుది వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నర్సంపేటలో ఎటు చూసినా శోకసంద్ర వాతావరణమే కనిపించింది. అభిమానుల రోదనలు, నివాళులతో పట్టణం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజల ప్రేమాభిమానాలకు ప్రతీకగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ప్రియ నేతకు అశ్రు నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.

## ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా

# హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి అని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణ రైజింగ్ చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని వ్యాఖ్యానించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతానికి పెంచడమే తమ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. 2037 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మారుస్తామని చెప్పుకొచ్చారు. పాలసీ పెరాలసిస్ తెలంగాణలో లేదని అభిప్రాయపడ్డారు. మంచి విధానాలు ఏ పార్టీవైనా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్యూర్,ప్యూర్, రేర్ మోడల్‌తో తెలంగాణను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డును పారిశ్రామికంగా విస్తరణ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీ మచిలీపట్నం 12 లేన్ల రహదారిగా విస్తరిస్తున్నట్లు వివరించారు. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు మూడు బు÷-లలెట్ రైళ్లు రానున్నాయని సీఎం వివరించారు. ఏఐ సునామీకి తగ్గట్లుగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఉద్యోగ నైపుణ్యాలను పెంచుతున్నామని చెప్పుకొచ్చారు. ఏటీసీల్లో చదివిన వారికి వందశాతం ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమెజాన్, అదానీ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ టాప్-500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. 'థింక్ గ్లోబల్ ..ఇన్వెస్ట్ లోకల్ అంటూ పెట్టుబడిదారులకు సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే వ్యాపారమని... ఇప్పుడు రైజింగ్ తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి

మొదటిపేజీ తరువాయి..

సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.

విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

### హాజరుకానున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

న్యూఢిల్లీ,జూలై31(ప్రజాజ్యోతి): చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నారు. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్ పర్యటనకు రాబోతున్నారు. సెప్టెంబర్‌లో భారత్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రావాల్సిందిగా జిన్‌పింగ్‌కు భారత్ ఆహ్వానం పంపింది. అయితే భారత్ పర్యటనకు జిన్‌పింగ్ సిద్ధంగా ఉన్నట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. గల్వాన్ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కనిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. బ్రిక్స్ కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలకు చైనా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో.. జిన్‌పింగ్ ఢిల్లీలో జరిగే శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని ఈ పరిణామాలపై అవగాహన ఉన్న వర్గాలు తెలిపినట్లు సమాచారం. అయితే జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు చైనా లేదా భారత్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాలని చైనా అధ్యక్షుడికి భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారానికి చైనా అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ కూటమి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందని తెలిపారు. ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్.. శిఖరాగ్ర సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశానికి జిన్‌పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జిన్‌పింగ్ భారత్‌కు వస్తే.. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఆయన చేపట్టే తొలి భారత పర్యటనగా ఇది నిలవనుంది. చివరిసారిగా జిన్‌పింగ్ 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు.

## ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

మొదటిపేజీ తరువాయి..

కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్యాంతికి, విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మృత్యువును జయించి తిరిగి వస్తారనే ఆశతో మనమంతా ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన పోరాట యోధుడిగా, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సోదరుడిగా పెద్ది సుదర్శన్ అన్న ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతారని హరీశ్‌రావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా నాకు ఒక ఉద్యమ సహచరుడిని, ఆత్మీయ సోదరుడిని కోల్పోయిన బాధ ఇది అని అన్నారు. పెద్ది సుదర్శన్ అన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ? వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. పెద్ది అన్నకు జోహార్లు తెలిపారు.

తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు.

నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర దిగ్భాం÷-రతికి, విషాదానికి గురిచేసిందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం.. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ఆశయాలను జీవితాంతం నమ్మి, ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కేటీఆర్ ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967